FOR ADS.....
ఆకాంక్ష
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :201 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ శుక్రవారం- 13 - మార్చి - 2026

## దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్... జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్




నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో అటానమస్ షిప్ యార్డ్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

సాగర్ డిఫెన్స్ సంస్థ తొలి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి

వెయ్యి మందికి పైగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు

ఏపీని మారిటైం రోబోటిక్స్ హబ్‌గా మార్చడమే లక్ష్యం

2026 నవంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభం

అమరావతి : ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, రక్షణ రంగాల్లో మరో కీలక ముందడుగు పడింది. దేశ సముద్ర సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా పెంచే దిశగా నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు మిగతా..2లో

## తెలంగాణలో ఒంటిపూట బడులు.. ఈ నెల 15 నుంచి కొత్త వేళలు




వేసవి తాపం దృష్ట్యా తెలంగాణలో ఒంటిపూట బడుల నిర్వహణ

ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు మారిన పనివేళలు

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు

పదో తరగతి ప్రత్యేక క్లాసులు యథాతథంగా కొనసాగింపు

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తించనున్న నిబంధనలు

హైదరాబాద్ : తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటిపూట బడులు (హాఫ్‌డే స్కూల్స్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు మిగతా..2లో

## గ్యాస్ కొరత.. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకే




- తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.
- రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్, మార్చి12: తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు.

# హైటెక్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి



- చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే చాలా ఇష్టం
- హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్టే అన్న సీఎం
- నెట్‌ఫ్లిక్స్‌కు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ

హైదరాబాద్: హైదరాబాద్‌ను గ్లోబల్ కంటెంట్ హబ్‌గా మార్చే దిశగా మరో భారీ అడుగు పడింది. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తన 'ఐలైన్ స్టూడియోస్' గ్లోబల్ విజువల్ ఎఫెక్ట్స్, వర్చువల్ ప్రొడక్షన్ హబ్‌ను హైటెక్ సిటీలో ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్లే అని అన్నారు. నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి పనిచేయాలనే తన కల నేడు నిజమైందని సంతోషం వ్యక్తం చేశారు. నెట్‌ఫ్లిక్స్ సంస్థకు ఇది ఇండియాలో రెండో కార్యాలయం అని చెప్పారు. ఫోర్త్ సిటీగా పిలుస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటుకు కావాల్సిన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని... ఈ సంస్థకు తమ ప్రభుత్వం మిగతా..2లో

## కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు

- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం
- 16వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ సమన్లు ఇచ్చిన సీబీఐ
- దీనిపై తన లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నానన్న కవిత



హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి సీబీఐ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లిన సీబీఐ అధికారులు, ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరుతూ ఆమెకు సమన్లు అందజేశారు. ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందిని డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని కోర్టు అప్పట్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ట్రయల్ కోర్టులో ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించడంతో పాటు, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. మిగతా..2లో

## బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా 47 గుడుల్లోకి హిందూయేతరులకు నో ఎంట్రీ




- త్వరలో ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర ప్రారంభం
- ఈ క్రమంలో బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా 47 గుడుల్లోకి హిందువులకు మాత్రమే ప్రవేశం

ఢిల్లి : మరికొద్ది రోజుల్లో చార్‌ధామ్ యాత్ర జరగనున్న వేళ ఉత్తరాఖండ్‌లో కీలక పరిణామం జరిగింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు.

## భారత్ పై నిందలు మోపడం పాక్‌కు అలవాటే

- అఫ్గానిస్థాన్‌తో తమకు జరుగుతున్న ఘర్షణలను భారత్ కారణమంటూ పాకిస్థాన్ ఆరోపణలు
- తీవ్రంగా ఖండించిన భారత్ దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదంటూ వ్యాఖ్య



ఢిల్లి : అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఘర్షణల వెనుక భారత్ ఉందన్న పాకిస్థాన్ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పాక్ చేసే ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని పేర్కొంది. తన తప్పులను దాచుకునేందుకు ఇతర దేశాలపై నిందలు వేయడం పాక్ కు అలవాటే అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ విమర్శించారు. దశాబ్దాలుగా పాక్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తుందని దుయ్యబట్టారు. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది మిగతా..2లో

## భారత్ ఎవరి దగ్గర చమురు కొనాలో అమెరికా ఎలా నిర్ణయిస్తుంది'

పై రాహుల్ ఫైర్ అమెరికాకు మోదీ ఎందుకు లొంగిపోయారో

ఎప్ స్టీన్ ఫైల్స్ రూపంలో నాకు సమాధానం దొరికింది

లోక్ సభలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు




ఢిల్లి : వంట గ్యాస్ కొరతపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. లోక్‌సభలో ఎల్ పీజీ అంశాన్ని ప్రస్తావించిన రాహుల్, హర్మూజ్ మిగతా..2లో

## మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే, బెంగాల్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తుంది...

### కొత్త గవర్నర్‌కు మమతా కీలక సందేశం

- పశ్చిమ బెంగాల్ 22వ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి ప్రమాణ స్వీకారం
- బెంగాల్‌ను ప్రేమించే వారినే బెంగాల్ ప్రేమిస్తుందని సీఎం మమత వ్యాఖ్య
- గత గవర్నర్లు ధన్‌ఖడ్, బోస్‌లతో విభేదాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం
- మాజీ ఐబీ అధికారి అయిన రవి, ఆనంద బోస్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు



ఢిల్లి : పశ్చిమ బెంగాల్ 22వ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆయనతో తొలిసారి సంభాషిస్తూ ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు. "మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే, బెంగాల్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తుంది" అని ఆమె రవికి సూచనప్రాయంగా తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిశాక, మమతా బెనర్జీ కొత్త గవర్నర్‌కు మెడలో శాలువా కప్పి స్వాగతం పలికారు. మిగతా..2లో

## ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది




- రంజాన్ తోఫా ఇవ్వకుండా ఇఫ్తార్ విందులు ఎందుకని ప్రభుత్వానికి ప్రశ్న
- చంద్రబాబు మోదీకి, బీజేపీకి భయపడుతున్నారని ఆరోపణ
- మైనారిటీ సంక్షేమంపై కూటమి ప్రభుత్వానిది బూటకమని విమర్శ
- వెంటనే పేద ముస్లింలకు తోఫా పంపిణీ చేయాలని డిమాండ్

# హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫోటో బదులు కుక్క చిత్రం..!

- అడ్మిట్ కార్డులో కుక్క ఫోటో చూసి షాక్ అయిన అభ్యర్థి...
- పరీక్షకు ముందు హాల్‌టికెట్ గందరగోళం.. అధికారులకు ఫిర్యాదు చేసిన అభ్యర్థి...
- బీహార్ కోర్టు పరీక్షలో విచిత్ర ఘటన..


OFFICE OF THE CONVENOR, CENTRALIZED SELECTION AND APPOINTMENT COMMITTEE-CUM-PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, PATNA
Employment Notice No. 04/2022
Preliminary Test - Recruitment Examination for the post of Attendant [Peon (General + Orderly)], 2022
Admit Card (Candidate's Copy)

...umber: Registration Number: 1105618

Candidate's Name:
Father's Name:
...te of Birth(dd-mm-yyyy):
Gender: Male Category: SC
Domicile Bihar: Yes PWBD(PH): No
...t Address: DHAWAN DHAWAN DURGADIH BIKRAMGANJ ROTHAS Bihar 802212

| Date of Examination | Reporting Time | Gate Closure Time | Examination Time |
|---|---|---|---|
| 15-03-2026 | 08:30 A.M. to 09:30 A.M. | 09:30 A.M. | 10:00 A.M. to 12:00 Noon. |

...ination Centre code and Name: (D15-3704) EKLAVYA CENTRAL SCHOOL, NEAR M.S.SULINDABAD, SAHARSA, SAHARSA - 85220 (BIHAR)


న్యూఢిల్లీ//మార్చి12(ఆకాంక్ష) : బీహార్ రాష్ట్రంలో ఆశ్చర్యానికి గురిచేసే ఘటన వెలుగులోకి వచ్చింది.జిల్లా కోర్టు నియామక పరీక్షలకు దరఖాస్తు చేసిన అభ్యర్థికి వచ్చిన హాల్‌టికెట్‌పై అతని ఫోటో స్థానంలో కుక్క ఫోటో ఉండటం సంచలనం రేపింది. ఈ ఘటనతో బీహార్ సివిల్ కోర్టు నియామక ప్రక్రియపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళితే, రితేశ్ కుమార్ అనే అభ్యర్థి నాలుగేళ్ల క్రితం బీహార్ సివిల్ కోర్టులో ప్యూన్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు.ఇటీవల పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. అందులో భాగంగా రితేశ్ కుమార్ కూడా తన హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అయితే హాల్‌టికెట్‌ను పరిశీలించిన అతను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు.తన ఫోటో ఉండాల్సిన చోట కుక్క ఫోటో కనిపించడంతో అతను ఆశ్చర్యానికి గురయ్యాడు. మొదట ఇది సాంకేతిక లోపమేమోనని భావించిన రితేశ్ కుమార్ మళ్లీ తన హాల్‌టికెట్‌ను పరిశీలించాడు. అయినప్పటికీ అదే ఫోటో కనిపించడంతో అతను తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.ఈ విషయాన్ని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు రితేశ్ కుమార్ బీహార్ సివిల్ కోర్టు రిక్రూట్మెంట్ బోర్డుకు

## సీఎం చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేశ్




- ఏపీ పర్యాటక రంగంలోకి పెట్టుబడులు.. సీఎం చంద్రబాబు ప్రశంసలు
- విశాఖలో భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్
- రూ.100 కోట్లతో ఒప్పందం
- ముంబై పర్యటన విజయవంతం అయిందన్న మంత్రి కందుల దుర్గేశ్

తొలి ఆకాంక్ష



## మొదటి పేజి తరువాయి

## హాల్‌టికెట్‌పై అభ్యర్థి ఫోటో బదులు కుక్క చిత్రం..!

ఫిర్యాదు చేశాడు.హాల్‌టికెట్‌లో జరిగిన తప్పును సవరించి తనకు సరైన అడ్మిట్ కార్డు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశాడు.ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ నియామక ప్రక్రియల్లో ఇలాంటి నిర్లక్ష్యం తగదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక అభ్యర్థి భవిష్యత్తుతో సంబంధం ఉన్న పరీక్షలో ఇలాంటి లోపాలు జరగడం ఆందోళనకరమని అభిప్రాయ పడుతున్నారు.ఇక బీహార్ సివిల్ కోర్టు రిక్రూట్మెంట్ పరీక్షలు మార్చి 15వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారులు ఇప్పటికే ప్రకటించారు.పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. హాల్‌టికెట్‌లో జరిగిన ఈ విచిత్ర ఘటనపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారా లేదా అనే విషయంపై అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ ఘటనతో ప్రభుత్వ నియామక వ్యవస్థల్లో సాంకేతిక లోపాలు, నిర్లక్ష్యం వంటి అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకతతో పాటు సాంకేతికపరమైన ఖచ్చితత్వం కూడా ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు

## సీఎం చంద్రబాబు అభినందించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేశ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలోకి పెట్టుబడులను ఆకర్షించేందుకు తాను జరిపిన ముంబై పర్యటనను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించడంపై రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ఆనందం వ్యక్తం చేశారు. సీఎం ప్రశంసలు తనలో మరింత ఉత్సాహాన్ని నింపాయని ఆయన తెలిపారు. ముంబయిలో జరిగిన ఐఏపీఐ ఎక్స్‌పోలో తాను పాల్గొని, రాష్ట్ర పర్యాటక పాలసీ, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించినట్లు మంత్రి తెలిపారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రముఖ సంస్థ 'మోడ్రన్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్' విశాఖపట్నంలో రూ.100 కోట్ల పెట్టుబడితో ఒక భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఈ పర్యటనలోనే ఏఐ ఆధారిత సినిమా, స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలపై యూరోస్ సంస్థ ప్రతినిధులతో ఫలప్రదమైన చర్చలు జరిపినట్లు దుర్గేశ్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశంతో అమరావతిలో 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేసి, రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీకి కొత్త అవకాశాలు సృష్టించేందుకు అన్ని రకాలుగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఇఫ్తార్ విందులు సరే... రంజాన్ తోఫా ఏది

అమరావతి : ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులు బాగానే ఉన్నాయని, కానీ పేద ముస్లింలకు ఇస్తానన్న 'రంజాన్ తోఫా' సంగతేంటని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'చంద్రన్న తోఫా' ఇస్తామని చెప్పి, రెండేళ్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ఆమె నిలదీశారు. ఈ సందర్భంగా షర్మిల సోషల్ మీడియాలో స్పందిస్తూ... "రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి, 12 లక్షల పేద ముస్లిం కుటుంబాలకు తోఫా ఇవ్వడానికి అవసరమైన రూ.65 కోట్లు బరువయ్యాయా?" అని విమర్శించారు. గతంలో తోఫా ఇవ్వనందుకు జగన్‌కు ముస్లింలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మీకు ఎలా చెప్పాలో ఆలోచించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న మైనారిటీ సంక్షేమం అంతా బూటకమని షర్మిల ఆరోపించారు. "చంద్రబాబు ప్రధాని మోదీకి వణుకుతున్నారు. బీజేపీకి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి ముఖ్యమంత్రి గులాంగిరీ చేస్తున్నారు. మైనారిటీలకు నిధులిస్తే తమ సంక్షేమం ఎక్కడ ఆగిపోతుందోనని భయపడుతున్నారు" అని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు మైనారిటీల అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే, బెంగాల్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తుంది...

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "బెంగాల్‌లో అన్ని భాషల ప్రజలు కలిసిమెలిసి శాంతియుతంగా ఉంటారు. కానీ, బెంగాల్‌ను ప్రేమించే వారిని బెంగాలీలు కూడా ప్రేమిస్తారన్నది ముఖ్యం. ఇది బెంగాలీల నైజం" అని వివరించారు. దీనికి గవర్నర్ రవి స్పందిస్తూ.. "పశ్చిమ బెంగాల్ దేశానికి మేధో, సాంస్కృతిక రాజధాని అనేది నిజం" అని అన్నారు. మమత చేసిన ఈ వ్యాఖ్యల వెనుక బలమైన రాజకీయ సందేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా రాజ్ భవన్ నుంచి ఎలాంటి చర్యలు ఉండకూడదనేది ఆ సందేశం సారాంశం అని విశ్లేషిస్తున్నారు. గతంలో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్ (ప్రస్తుత ఉపరాష్ట్రపతి), ఆ తర్వాత వచ్చిన సి.వి. ఆనంద బోస్‌ల హయాంలోనూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్ భవన్‌కు మధ్య తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మమత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మార్చి 5న సి.వి. ఆనంద బోస్ గవర్నర్ పదవికి అనూహ్యంగా రాజీనామా చేయగా, అదే రోజు సాయంత్రం ఆయన స్థానంలో రవిని నియమిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. మాజీ ఐబీ అధికారి ఆర్ఎన్ రవి... ఇటీవల వరకు తమిళనాడుకు గవర్నర్ గా వ్యవహరించారు. బుధవారం కోల్‌కతాకు చేరుకున్న రవి, గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో, 2011 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మరో మాజీ ఐబీ చీఫ్ ఎం.కె. నారాయణన్ కూడా బెంగాల్ గవర్నర్‌గా పనిచేయడం గమనార్హం.

## హైటెక్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి

అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ అంటేనే బిజినెస్ అని, ఇక్కడ పెట్టుబడులకు పూర్తి రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. తనకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే చాలా ఇష్టమని ముఖ్యమంత్రి తెలిపారు. తన చిన్నప్పటి బ్లాక్ అండ్ వైట్ టీవీలు, వీసీఆర్‌ల నుంచి నేడు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'కల్కి' వంటి అంతర్జాతీయ స్థాయి సినిమాల వరకు వచ్చిన మార్పులను సీఎం గుర్తుచేసుకున్నారు. చెన్నై నుంచి టాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తెచ్చిన ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, హీరో రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు, పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత.. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకే

కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. మరో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక




చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

## కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు

ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కవితకు సమన్లు అందించారు. ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "ఈరోజు మధ్యాహ్నం సీబీఐ అధికారులు నాకు నోటీసులు అందజేశారు. దీనిపై నా లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నాను. చట్టంపై నాకు నమ్మకం ఉంది. విచారణకు సంపూర్ణంగా సహకరిస్తాను" అని

## చాలా ఫిర్యాదులున్నాయి - ఫారెస్ట్ అధికారులు పీపుల్స్ ఫ్రెండ్లీగా మారాలి

### మొదటి పేజి తరువాయి

పోలీస్ పీపుల్స్ ఫ్రెండ్లీగా మారారు కానీ ఫారెస్ట్ మారలేకపోతోందంటూ కామెంట్ చేశారు. అటవీ శాఖ అధికారుల తీరు వల్ల ఇటీవల కాలంలో ఏర్పడ్డ ఇబ్బందులను సమావేశంలో సీఎం ప్రస్తావించారు. హిందూపూర్ వద్ద ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటుకు ఆలోచిస్తున్నామని వెల్లడించారు.

టవీశాఖపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి - అధికారులు పీపుల్స్ ఫ్రెండ్లీగా మారాలి : చంద్రబాబు

అటవీ శాఖపై అనేక ఫిర్యాదులు : అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ శాఖ సహకరించాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అటవీ శాఖ విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని చంద్రబాబు తెలిపారు. దీనిపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రితో మాట్లాడానని, మళ్లీ మరోసారి మాట్లడతానన్నారు. గ్రీన్ కవర్ పెంచండి, బయోడైవర్సిటీకి వెళ్లాలి, ప్రజలు ఆహ్లాదంగా పర్యటించేందుకు ఉపయుక్తంగా పరిస్థితులు మారాలని సూచించారు. ఫారెస్టు అధికారులు జిల్లా కలెక్టర్ కిందే పని చేయాలని గుర్తుంచుకోవాలని చంద్రబాబు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగానే పర్యావరణహిత ప్రాజెక్టులకు సహకరించాలని సూచించారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రైవేటు, అటవీ, ఎండోమెంట్ తదితర క్లాసిఫికేషన్ల ప్రకారం రిజర్వు ల్యాండ్ ను గుర్తించాలన్నారు. కొందరు అటవీ శాఖ అధికారుల ఇంప్రాక్టికల్ థింకింగ్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. ఆ రోజు తొక్కిసలాట అయ్యే పరిస్థితి : గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా అని ప్రశ్నించారు. శ్రీశైలంలో వస్తున్న భక్తులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు, ఆ తర్వాత రోజు తొక్కిసలాట అయ్యే పరిస్థితి వచ్చిందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, బద్వేలులోనూ అటవీ శాఖ ఇదే తరహాలో వ్యవహరించిందని మండిపడ్డారు. "అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ శాఖ సహకరించాలి. ఈసారి అటవీశాఖ విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై డిప్యూటీ సీఎంతో మాట్లాడాను, మళ్లీ మరోసారి మాట్లాడతాను. గ్రీన్ కవర్ పెంచండి, బయోడైవర్సిటీకి వెళ్లాలి. ప్రజలు ఆహ్లాదంగా పర్యటించేందుకు ఉపయుక్తంగా పరిస్థితులు మారాలి.ప్రైవేటు, అటవీ, ఎండోమెంట్ క్లాసిఫికేషన్ల ప్రకారం రిజర్వు ల్యాండ్‌ను గుర్తించాలి. కొందరు అటవీ అధికారుల ఇంప్రాక్టికల్ థింకింగ్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా?". - చంద్రబాబు, సీఎం ఈసారి వేసవి ప్రభావం ఎక్కువ : మరోవైపు వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టు, ఆర్టీజిహెచ్ ఇంటిగ్రేషన్, హీట్ వేవ్స్ పై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు చేశారు. తక్కువ వ్యయంతో పోర్టబుల్ గా ఉండేలా మెడ్ టెక్ టూల్స్ తయారు చేయాలని సూచించారు. ఆర్టీజిహెచ్ ద్వారా మరిన్ని ఆవిష్కరణల్ని చేసి ప్రజారోగ్యం కోసం వినియోగిద్దామన్నారు. ఈసారి వేసవి ప్రభావం ఎక్కువ ఉంటుందని అంచనాలు ఉన్నాయన్న సీఎం, వడగాలుల వల్ల విషయంలో ముందుగానే ప్రచారం చేపట్టాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు జాగ్రత్తలు : ఎండలో పని చేసే ఉపాధి హామీ కూలీలకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదని తెలిపారు. పశువులకు నీటి తొట్టెలను పెద్ద ఎత్తున నిర్మించాం, ఆ తొట్టెల్లో నీళ్లు నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి పశు బీమా పథకాన్ని కూడా సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలాగే పెట్టుబడులు పెట్టే వారెవరో గుర్తించి వారిని కలెక్టర్లు, మంత్రులు సంప్రదించే పరిస్థితి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. అదే విధంగా హైదరాబాద్ ను ప్రమోట్ చేయడం వల్లే ×ాదీ వచ్చిందని గుర్తు చేశారు. జిల్లాల్లో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలు, తలసరి ఆదాయం ఎంతమేర పెంచాం అన్నదానిపై జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టాలని సూచించారు. తదుపరి సమావేశం నుంచి ఏ జిల్లా కలెక్టర్ ఎంతమేర పరిశ్రమల్ని ప్రోత్సహించారన్న దానిపై సమీక్షిస్తామని సీఎం వెల్లడించారు.

## భారత్ పై నిందలు మోపడం పాక్‌కు అలవాటే

### మొదటి పేజి తరువాయి

దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపారు. పాక్ ఎన్ని కథలు సృష్టించినా వాస్తవాలను మార్చలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

దాడుల్లో మహిళలు, పిల్లలు మరణించడం బాధాకరం : భారత్

మరోవైపు, అఫ్గాన్ భూభాగంపై పాకిస్థాన్ చేసిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. దాడుల్లో మహిళలు, పిల్లలు మరణించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. పవిత్రమైన రంజాన్ మాసంలో దాడులు జరపడంపై విచారం వ్యక్తం చేసింది. అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, స్వాతంత్ర్యానికి భారత్ పూర్తి మద్దతు ఉంటుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

మా సహనానికి హద్దులు దాటిపోయాయి!

మరోవైపు, పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య కొద్దిరోజులుగా జరుగుతున్న ఉద్రిక్తతలు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఫిబ్రవరిలో ఇరు దేశాల మధ్య ఉన్న (డ్యూరాండ్ లైన్) సరిహద్దు ప్రాంతంలో వైమానిక దాడులు జరిగాయి. ఫిబ్రవరి 27న అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్ సహా పలు ప్రాంతాలపై పాక్ వైమానిక దాడులు జరిపినట్లు సమాచారం. అయితే, ఈ దాడులపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ, తమ సహనానికి హద్దులు దాటిపోయాయని



ఆయన వ్యాఖ్యానించారు. అఫ్గానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం అంతర్జాతీయ ఉగ్రవాదులను ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపించారు. ఫిబ్రవరి 26న డ్యూరాండ్ రేఖ వెంబడి జరిగిన ప్రతీకార చర్యల్లో 55 మంది పాకిస్థాన్ సైనికులు మరణించారని అఫ్గానిస్థాన్ జాతీయ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2021లో అఫ్గాన్ లో తాలిబన్లు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ముఖ్యంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) అనే ఉగ్రవాద సంస్థకు అఫ్గానిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాక్ ఆరోపిస్తోంది. కాగా, టీటీపీ 2007లో పాక్ లో ఉద్భవించింది. అఫ్గాన్ లోని తాలిబన్ నుంచి వేరుగా ఉంది.

హర్మూజ్ లో నౌకల భద్రతపై ఇరాన్ తో మాట్లాడిన జైశంకర్

ఇదిలా ఉండగా, హర్మూజ్ జలసంధిలో నౌకల భద్రతపై విదేశాంగమంత్రి జైశంకర్, ఇరాన్ విదేశాంగమంత్రితో చర్చించారని రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలపైనా చర్చలు జరిపినట్లు తెలిపింది. ఇంధన సరఫరాలో స్థిరత్వం కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. ఇప్పటికే ఇరాన్ నుంచి అనేక మంది భారతీయులు సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారని తెలిపారు. భూమార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలనుకునే వారు టెహ్రాన్‌లో భారత రాయబార కార్యాలయం ఆదేశాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. "ఇటీవల కాలంలో విదేశాంగమంత్రి జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రితో మూడు సార్లు మాట్లాడారు. చివరి సారి మాట్లాడినప్పుడు నౌకల భద్రత సహా దేశ ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చించారు. దాదాపు 9వేల మంది భారతీయులు ఇరాన్‌లో ఉన్నారు. జనవరి 14, ఫిబ్రవరి 23న జారీ చేసిన అడ్వైజరీల కారణంగా అనేక మంది భారతీయులు ముఖ్యంగా విద్యార్థులు ఇరాన్‌ను వీడి భారత్ చేరుకున్నారు. టెహ్రాన్‌లో చిక్కుకున్న విద్యార్థులు, యాత్రికులను ఇరాన్‌లోనే సురక్షిత ప్రాంతాలకు తరలించాం. అజర్‌బైజాన్, అర్మేనియాకు ప్రయాణించాలనుకునే భారతీయ పౌరులకు సాయం చేస్తున్నాం. అక్కడి నుంచి విమానాల్లో భారత్ కు రావడానికి సహాయం చేస్తున్నాం" రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

## భారత్ ఎవరి దగ్గర చమురు కొనాలో అమెరికా ఎలా నిర్ణయిస్తుంది'

### మొదటి పేజి తరువాయి

జల సంధి నుంచి పెద్దఎత్తున దిగుమతులు జరగాల్సి ఉందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తపరిస్థితుల నేపథ్యంలో హోర్మూజ్ జలసంధి నుంచి దిగుమతులు ఆగిపోయాయని తెలిపారు. భారత్ ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకని నిలదీశారు. ఈ అంశంపై ఆలోచించగా ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో తనకు సమాధానం దొరికిందని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉందని రాహుల్‌గాంధీ అనుమానం వ్యక్తం చేశారు.

రూల్స్ ప్రకారం ఇలా మాట్లాడకూడదు: ఓం బిర్లా

అయితే రాహుల్ గాంధీ మాట్లాడుతుండగా, స్పీకర్ ఓం బిర్లా ఆయనను వారించారు. "దేశంలో నెలకొన్న గ్యాస్ కొరతపై మాట్లాడేందుకు అనుమతి కోరుతూ రాహుల్ గాంధీ ఇచ్చిన నోటీసు ప్రతి నా దగ్గర ఉంది. ఆ విషయంపై మాట్లాడడానికి నేను ఆయనకు అనుమతి ఇచ్చాను. అయితే, బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా ఉండి కూడా, ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఇతర అంశాలపై చర్చించడం పార్లమెంట్ నియమ, నిబంధనలకు, విధానాలకు విరుద్ధం. నేను మీకు (రాహుల్ గాంధీ) మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాను. పార్లమెంట్ ఈ విధంగా పనిచేయదు. పార్లమెంట్ కేవలం నియమనిబంధనలు, విధానాలకు అనుగుణంగానే పనిచేస్తుంది" అని అన్నారు.నో ప్రోబ్లమ్ రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి హర్దీప్ సింగ్ పురి సమాధానం ఇచ్చారు. దేశంలో గృహ వినియోగదారులకు అందించే వంట గ్యాస్ (ఎల్ పీజీ) సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. తాము ఎప్పటికప్పుడు పరిస్థితులను చక్కదిద్దుతున్నామన్నారు. అంతేకాదు పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ సరఫరాలో కూడా ఎలాంటి కొరత లేదని స్పష్టంచేశారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని చెప్పారు. కాగా, భారత్ 60 శాతం ఎల్‌పీజీని గల్ఫ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు హర్దీప్‌సింగ్ పేర్కొన్నారు. సిలిండర్ల సరఫరాలో ఆస్పత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25, గ్రామాల్లో 45 రోజుల గడువు విధించినట్లు వెల్లడించారు. వాణిజ్య సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌లో



విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకలు ఆగిపోవడం ఇదే తొలిసారని, ప్రపంచం ఇలాంటి చమురు సంక్షోభం ఎన్నడూ చూడలేదని హర్దీప్‌సింగ్ పేర్కొన్నారు."ఇది వదంతులు వ్యాప్తి చేయడానికి లేదా తప్పుడు కథనాలు సృష్టించడానికి తగిన సమయం కాదు. చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ప్రపంచ ఇంధన సంక్షోభాన్ని ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటోంది. అయినప్పటికీ నిత్యావసరాల సరఫరా కొనసాగుతోంది. గృహాలకు, వ్యవసాయ రంగానికి గ్యాస్ సరఫరాలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎల్‌పీజీ ఉత్పత్తిని ఇప్పటికే 28 శాతం మేర పెంచాం. ఈ క్లిష్ట సమయంలో భారతీయులందరూ ఏకతాటిపై నిలిచి, మన ఇంధన యోధులకు (ఎనర్జీ వారియర్స్)కు, ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటున్న సంస్థలకు, దేశానికి అండగా నిలవాలి" అని హర్దీప్ సింగ్ కోరారు.

## బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా 47 గుడుల్లోకి హిందూయేతరులకు నో ఎంట్రీ

### మొదటి పేజి తరువాయి

ఈ ఆలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధిస్తున్నట్లు బద్రీనాథ్-కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) ప్రకటించింది. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే 47 దేవాలయాల్లోనూ ఇదే ఎంట్రీ నిబంధన వర్తిస్తుందని వెల్లడించింది. 2026 జనవరిలో ఉత్తరాఖండ్‌లోని గంగా సభ 'హర్ కీ పౌడీ' ఘాట్‌కు హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో 'హర్ కీ పౌడీ' ఘాట్‌లోని పలుచోట్ల హిందూయేతరులకు ప్రవేశం లేదని బోర్డులు కూడా పెట్టింది. దీంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత చార్‌ధామ్‌లోకి హిందువులు కాని వారిని అనుమతించకూడదని డిమాండ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ఈ ఏడాది జనవరిలో కీలక ప్రకటన చేశారు. బీకేటీసీ పరిధిలో ఉన్న దేవాలయాలలో హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించే తీర్మానాన్ని ఆమోదిస్తామని అన్నారు.

బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా 47 గుడుల్లోకి హిందూయేతరులకు నో ఎంట్రీ (జుబు దీప్తుతీఫ్)

బడ్జెట్ సమావేశంలో నిర్ణయం

మార్చి 10న డెహ్రాడూన్‌లోని బీకేటీసీ క్యాంప్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం జరిగింది. బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.121.7 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే బీకేటీసీ పరిధిలోని బద్రీనాథ్, కేదార్‌నాథ్‌తో సహా 47 దేవాలయాల్లోకి



హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే : అసదుద్దీన్ ఓవైసీ

ఈ నిర్ణయంపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. హరిద్వార్‌లో హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధిస్తూ పోస్టర్లు వేయడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ఓవైసీ అన్నారు. ఇది అంటరానితనం, సమానత్వ హక్కును ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని అభిప్రాయపడ్డారు. అటువంటి భావజాలాన్ని కలిగి ఉండటం అంటే చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. మరోవైపు, ఇటువంటి ఆంక్షలు సమాజంలో విభజనను తీవ్రతరం చేస్తాయని జమియత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు అర్షద్ మదానీ తెలిపారు. ఇది భారతదేశ సంస్కృతి, పరస్పర గౌరవ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించడాన్ని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇమామ్ డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ సమర్థించారు. ఇది మతానికి సంబంధించిన విషయమని అన్నారు. హిందూయేతరులు గుడిలోకి ప్రవేశించకూడదని ఆలయ కమిటీ నిర్ణయిస్తే, ఎవరూ అభ్యంతరం చెప్పకూడదని పేర్కొన్నారు. మక్కా, మదీనాలో ముస్లిమేతరులకు అనుమతి లేదని, దానికి ఎవరూ అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి మతపరమైన విషయాల్లో రాజకీయాలు ఉండకూడదని అభిప్రాయపడ్డారు. సీఎం ఏమన్నారంటే? అయితే బీకేటీసీ తీసుకున్న నిర్ణయంపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ స్పందించారు. మతపరమైన ప్రదేశాలను నిర్వహించే సంస్థలు, వ్యక్తులతో సంప్రదించిన తర్వాత ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని మతపరమైన, పవిత్ర స్థలాలను తీర్థ సభ, గంగా సభ, కేదార్ సభ, బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ, పూజ్య సంత్ సమాజ్ నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం వారందరి అభిప్రాయాలు ఆధారంగా ముందుకు సాగుతుందని వెల్లడించారు.

'రాజ్యాంగం ప్రకారం ఈ నిర్ణయం'

హిందూ మతం, సనాతన ధర్మాన్ని పాటించేవారిని కేదార్‌నాథ్, బద్రీనాథ్‌కు స్వాగతిస్తున్నామని బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది తెలిపారు. అయితే సనాతన ధర్మాన్ని పాటించని వారు ఆలయంలోకి ప్రవేశించాన్ని పూర్తిగా నిషేధించామని చెప్పారు. రాజ్యాంగం ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సనాతన ధర్మం, హిందూ మత ప్రదేశాలు దేశానికి ఆత్మలాంటివని అభిప్రాయపడ్డారు.

ఏప్రిల్ 19న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

చార్‌ధామ్ యాత్ర ఈ ఏడాది ఏప్రిల్ 19న ప్రారంభం కానుంది. ఆ రోజున గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరుస్తారు. యాత్రికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 6న ప్రారంభమైంది. చార్‌ధామ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## దేశంలోనే తొలి అటానమస్ షిప్ యార్డ్... జువ్వలదిన్నెలో శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

### మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. శంకుస్థాపన కార్యక్రమానికి జువ్వలదిన్నె చేరుకున్న మంత్రి లోకేశ్ కు సాగర్ డిఫెన్స్ సంస్థ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ప్రాజెక్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కూటమి ప్రభుత్వం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో 29.58 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇందులో 7.58 ఎకరాల వాటర్ ఫ్రంట్ ల్యాండ్ కూడా ఉండటం విశేషం. మొదటి దశలో సాగర్ డిఫెన్స్ సంస్థ రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుండగా, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి




పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన-అభివృద్ధి వంటి కీలక రంగాల్లో ఉపాధి లభిస్తుంది. 2026 నవంబర్ నాటికి ఈ కేంద్రంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టును మొత్తం 200 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో బ్లూ ఎకానమీ, మారిటైం ఆవిష్కరణలు బలోపేతం కావడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అంతకుముందు, జిల్లాకు విచ్చేసిన మంత్రి నారా లోకేశ్ కు బోగోలు మండలం కప్పరాలతిప్ప వద్ద నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు, సాగర్ డిఫెన్స్ సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఈ యుద్ధాల వల్ల 'లాభాలు' ఎవరికి?

ఫిబ్రవరి 28న ఇరాన్ మీదకి ఇజ్రాయిలు ప్రభుత్వమూ, దాన్ని నడిపే అమెరికా ప్రభుత్వమూ కలిసికట్టుగా బాంబులతో దాడి మొదలుపెట్టి, ఇప్పటికీ కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధాన్ని అనేక కోణాల్లో చర్చించిన వ్యాసాలు వస్తున్నాయి. ఈ యుద్ధం, అంతర్జాతీయ న్యాయసూత్రాలకు ఎలా విరుద్ధమో; ఇజ్రాయిలు ప్రాంతీయ ఆధిపత్యం కోసమూ, అమెరికానేమో ప్రపంచ ఆధిపత్యం కోసమూ, ఎంత దౌర్జన్యంగా ఈ యుద్ధాన్ని సాగిస్తున్నాయో ఇలా వేరు వేరు కోణాలలో చర్చించడం వల్ల పాఠకులకు ఎంతో ఉపయోగమే. ఈ వ్యాసంలో, యుద్ధాలకు మూలం, సరుకుల అమ్మకాల కుమ్ములాటల్లో ఎలా వుందో చూపాలని నా ప్రయత్నం.ఏ సమాజంలో అయినా సరుకుల ఉత్పత్తి ప్రధానంగా రెండు శాఖల్లో జరుగుతుంది. ఒకటి: సరుకుల్ని తయారు చేయించడానికి అవసరమైన ఉత్పత్తి సాధనాల శాఖ. యంత్రాలూ, ముడిపదార్థాలూ వగైరాలు ఈ శాఖలో తయారయ్యే సరుకులు. ఇంకో శాఖలో, తిండీ, బట్టా, నివాసమూ, వైద్యమూ, విద్యా వంటి పోషణకి కావలిసిన సరుకులు తయారవుతాయి. పెట్టుబడిదారీ సమాజంలో, అటు ఉత్పత్తి సాధనాలుగా గానీ, ఇటు పోషణ వస్తువులుగా గానీ పనికిరాని ఉత్పత్తి ఒకటి జరుగుతుంది. అదే ఆయుధాల ఉత్పత్తి. వీటిని తయారు చేసేది ఎందుకంటే: ఒక వర్గం ఇంకో వర్గాన్ని అణచి వుంచడానికో; ఒక దేశ ప్రభుత్వం ఇంకో దేశ ప్రభుత్వాన్ని తన చెప్పుచేతల్లో వుంచుకోడానికో! ఇప్పుడు అమెరికాఇజ్రాయిల్ దేశాలు సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం తక్షణ లక్ష్యం ఇరాన్ మీద ఆధిపత్యం! ఆ ఆధిపత్యం వల్ల, ఇరాన్‌లో అపారంగా దొరికే 'చమురు' అనే సరుకుతో పాటు, జింకూ, రాగీ, ఇనుమూ, బంగారమూ, బొగ్గూ, లిథియం వంటి విలువైన ఖనిజాల్నీ, లోహాల్నీ లాగేసుకోవడానికి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తరచుగా రెండు దేశాల మధ్య గానీ, రెండు కూటముల మధ్య గానీ యుద్ధాలు జరిగితే లాభపడేది, యుద్ధ సామాగ్రిని సరుకులుగా తయారు చేయించే పెట్టుబడిదారులే. ఆయుధాల్ని తయారుచేయించేది ప్రైవేటు పెట్టుబడిదారులే కాదు, ప్రభుత్వమే ఒక పెట్టుబడిదారుగా ఆ పని చేయిస్తుంది. ఇప్పుడు జరుగుతున్న యుద్ధంలో, వందల, వేల సంఖ్యలో ఆయుధాలు ఖర్చయిపోతూ, ఆయుధాల కొరత ఏర్పడుతూ వుంది అని వార్తలు. అందుకే ఇటీవల అతి పెద్ద ఆయుధ కంపెనీల వాళ్ళని, అమెరికా రక్షణ శాఖ పిలిపించి, గతంలో కంటే 34 రెట్ల ఆర్డర్లు ఇచ్చిందని రాయిటర్ వార్తా సంస్థ తెలిపింది. అంతేకాదు, ఇవ్వాళే, 660 మిలియన్ల డాలర్ల విలువగలిగిన 27,000 బాంబులను ఇజ్రాయిల్‌కి అమ్మడానికి అమెరికా నిర్ణయించింది. ఆయుధ తయారీ కంపెనీలలో, అమెరికాలో వున్న అధికారప్రతిపక్ష పార్టీల నాయకులకూ, వాళ్ళ భార్యలకూ, పెద్ద మొత్తంలో షేర్లు వున్నాయి! ఇరాన్ మీద అమెరికాఇజ్రాయిళ్ళు యుద్ధం ప్రారంభించడానికి రెండు రోజుల ముందు, అంటే ఫిబ్రవరి 26న, ఏయే దేశాలకు అమెరికా ఆయుధాల్ని ఎన్ని అమ్మిందో, ఎన్ని ఇంకా సప్లై చెయ్యాల్సివుందో, ఆ వివరాలన్నీ అమెరికా విదేశాంగ వెబ్‌సైట్‌లో ఇచ్చారు. ఫిబ్రవరి 6వ తేదీన జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం, దాదాపు 40 దేశాలకు ఏ రకమైన, ఎంత శక్తివంతమైన, ఎన్ని శాల్తీలు, ఎప్పటికల్లా కావాలో, అన్ని వివరాలూ వున్నాయి. ఆ 40 దేశాల్లో, ఇప్పుడు ఇరాన్ చుట్టూ వున్న, అమెరికా అనుకూల దేశాలు కూడా వున్నాయి. సౌదీ అరేబియా, కువైట్, లెబనాన్, బహ్రైన్, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్, ఖతర్ వగైరా! అంటే, ఆ దేశాలు అమెరికా నించీ కోట్ల కోట్ల డాలర్లు ఖర్చుపెట్టి ఆయుధాలని కొని తీరాలన్నమాట! అంత డబ్బు ఎక్కణ్ణించీ వస్తుంది? శ్రామిక జనాలనించీ, వారి యజమానులు శ్రమ దోపిడీ ద్వారా లాగిన, కోట్ల కోట్ల అదనపు విలువ నించీ! కనీసం, విద్య, వైద్యం, ఉద్యోగాలూ వంటి వాటిమీద ఖర్చుపెట్టడం అన్నా కాదు. పరాయి దేశం మీదకి సైనికుల్ని పంపి, అక్కడి ప్రజల్నీ, సైనికుల్నీ వీళ్ళూ; ఇక్కడి ప్రజల్నీ, సైనికుల్నీ అవతలి దేశమూ చంపుకోవడాలే కదా? ఒకరి రక్తాన్ని ఇంకోరు కళ్ళ చూడడమే గదా? ఈ దారుణ పరిస్థితుల్ని, సాహిర్ లూధ్వియాన్వీ అనే ఒక కమ్యూనిస్టు భావాలు గల ఉర్దూ కవి, 1965లో, 'ఓ మంచి మనుషులారా' అనే ఒక యుద్ధ వ్యతిరేక గీతంలో ఇలా అంటాడు: "మన రక్తమై ఉండొచ్చు/ లేదా పరుల రక్తమై ఉండొచ్చు/ చివరికి అది మానవ జాతి రక్తమే/ యుద్ధం తూర్పులో జరిగినా/ లేదా పడమట జరిగినా/ చివరికి అది ప్రపంచ శాంతి రక్తమే/ బాంబులు ఇళ్లపై పడినా/ లేదా సరిహద్దులపై పడినా/ సృష్టి ఆత్మ గాయపడుతుంది/ మన పొలాలు కాలిపోయినా/ లేదా ఇతరులవి కాలిపోయినా/ జీవితం ఆకలితో తల్లడిల్లుతుంది/ ట్యాంకులు ముందుకు వెళ్లినా/ లేదా వెనక్కి తగ్గినా/ భూమి గర్భం బంజరమవుతుంది/ విజయోత్సవం జరిగినా/ లేదా ఓటమి దుఃఖం వచ్చినా/ జీవితం మృతదేహాలపై ఏడుస్తుంది/ యుద్ధం తానే ఒక సమస్య/ అది సమస్యలకు పరిష్కారం ఎలా ఇస్తుంది?" "అందుకే ఓ మంచి మనుషులారా/ రండి, ఈ దురదృష్ట ప్రపంచంలో/ ఆలోచనల వెలుగును వ్యాప్తి చేద్దాం/ శాంతికి బలం ఇచ్చే/ అలాంటి పోరాటాలను ప్రారంభిద్దాం/ మరణాన్ని పండించే రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం/ పేదరికానికీ, బానిసత్వానికీ వ్యతిరేకంగా పోరాటం/ తప్పుదారి పట్టిన నాయకత్వానికి వ్యతిరేకంగా పోరాటం/ పెట్టుబడిదారీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం/ యుద్ధాల తత్వానికి వ్యతిరేకంగా పోరాటం/ శాంతియుత జీవితం కోసం శాంతి!" మరి మనం చెయ్యవలిసింది, సాహిర్ చెప్పినట్టు, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడడమే. దానికి మొదటి అడుగు, లాభాల కోసం ఆ విధానం ఎంత దుర్మార్గానికీ, నీచత్వానికీ ఒడిగడుతుందో తెలుసుకోవాలి. దాని దుర్గుణాన్ని ఒక కార్మిక నాయకుడు ఎంత బాగా చెప్పాడో, మార్క్సు తన రచన 'పెట్టుబడి'లో, ఇలా ప్రస్తావిస్తాడు.

# ప్రపంచం మొత్తానికీ దినదినగండమే!



ఆయుధ కొనుగోళ్లు, రక్షణకు కేటాయింపులు పెరిగేకొద్దీ రుణభారమూ కట్టుతప్పుతుందని, ప్రజా సంక్షేమ పథకాలపై ప్రభావం పడటమే కాకుండా ప్రపంచ భద్రతా ప్రశ్నార్థకమవుతుందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ జోమో క్వామే సుందరం (జె.కె.సుందరం) ఆందోళన వ్యక్తం చేశారు. చాలా దేశాలు జనం చెల్లించే పన్నులతో ఆయుధాలు కొని యుద్ధజ్వాలలు రగిలిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్‌ల సమరాన్ని పరిశీలిస్తే దౌత్యవిధానాలకు స్వస్తి పలికి ప్రపంచాన్ని సుడిగుండంలోకి నెడుతున్నట్లుందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ యుద్ధ దుష్పరిణామాలను 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి ఎం.ఎల్.నరసింహారెడ్డికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన విశ్లేషించారు. ప్రొఫెసర్ జె.కె.సుందరం ఆర్థిక శాస్త్రంలో యేల్ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ, హార్వర్డ్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఐరాస ఆహార, వ్యవసాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తించారు. ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఎకనమిక్స్ అసోసియేట్స్ వ్యవస్థాపక ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం మలేసియాలోని ఖజానా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ సలహాదారుగా ఉన్నారు. కొలంబియా, కార్నెల్ విశ్వవిద్యాలయాల్లో ఆర్థిక శాస్త్ర విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా కూడా సేవలందిస్తున్నారు.

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఏ మేరకు ఉంది?

యుద్ధం మూలంగా పశ్చిమాసియాలో మిలిటరీ వ్యయం పెరిగి దేశాలు అప్పులపాలు అవుతాయి. చమురు, నిత్యావసరాల ధరలు ఎక్కువై రవాణా వ్యవస్థలు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇరాన్ వెనక్కి తగ్గకుండా ప్రతిదాడులకు దిగుతుండటంతో యుద్ధం త్వరగా ముగిసే పరిస్థితి కనిపించడం లేదు. ఈ ప్రభావం మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా ఉంటుంది. పైగా ఇరాన్ తరవాతి వంతు క్యూబాదేనని ట్రంప్ గుడ్లురుముతున్నారు. ఏడాది కాలంలో పది దేశాలపై అమెరికా బాంబులు వేసింది. మరో నాలుగు దేశాలకు హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధ ప్రభావం ఇప్పటికే తయారీ, వ్యవసాయ రంగాలపై పడింది. సాగు బాగా యాంత్రీకరణ చెందింది. వాటి వినియోగానికి ఇంధనం కీలకం. చమురు అవసరమయ్యే అన్ని రంగాలపై యుద్ధ దుష్పరిణామాలు ఉన్నాయి, ఇకపైనా ఉండనున్నాయి. దానివల్ల చమురు ఉత్పత్తి వ్యయమూ గణనీయంగా పెరుగుతుంది. అమెరికాలో మాత్రం ధరలను అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తారు. మిగిలిన ప్రపంచమంతా ప్రస్తుతానికి ఈ భారాన్ని భరించాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికే ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఐరోపాకు ఆయిల్ సరఫరా తగ్గింది. ఇరాన్ యుద్ధ ప్రభావం కూడా పడితే వారి పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లు అవుతుంది.

ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణానికి, ఆర్థిక మాంద్యానికి ఈ యుద్ధం ఎంత వరకు కారణమవుతుంది

యుద్ధంతో పాటు ఇతర అంశాలూ ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నాయి. అందులో సుంకాలు కూడా ఒకటి. అమెరికన్ సుప్రీంకోర్టు సుంకాలను రద్దు చేస్తే ట్రంప్ ఇంకో మార్గంలో వచ్చారు. తాను చెప్పినట్టల్లా, తమ ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రపంచ దేశాలన్నీ నడచుకోవాలని ఆయన సంకేతాలు పంపిస్తున్నారు. దేశాల సొంత అభిప్రాయాలతో ఆయనకు పనిలేదు. కాదూ కూడదంటే బెదిరింపులకు, దాడులకు దిగుతున్నారు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితుల్లో ప్రపంచం ఉందిప్పుడు. యుద్ధం ఎన్నిరోజులు కొనసాగుతుంది, పశ్చిమాసియాలో అది ఎంతగా తీవ్రరూపం దాలుస్తుంది అన్నదానిపై ప్రపంచ ఆర్థిక పరిస్థితి ఆధారపడి ఉంటుంది. 1970వ దశకంలో మాదిరిగా చమురు ధరలు ఇప్పుడు కూడా ఆకాశాన్నంటుతాయా అంటే– లేదని చెప్పలేం. ఎందుకంటే హర్మూజ్ జలసంధి మూసివేతతో చమురు రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఎర్రసముద్రంపై హూతీల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. తత్ఫలితంగా చమురు ధరలు, సరఫరాలపై ప్రభావం పడి ద్రవ్యోల్బణం కోరలుచాస్తుంది.

పెరుగుతున్న రక్షణ బడ్జెట్లు దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలను ఎలా ప్రభావితం చేస్తాయి?

అమెరికా సహా అనేక దేశాలు ఆయుధాల కొనుగోలుకు రక్షణ బడ్జెట్లను భారీగా పెంచడం వల్ల సంక్షేమ పథకాలు ఇప్పటికే దెబ్బతింటున్నాయి. ఉదాహరణకు అగ్రరాజ్యంలో పేదలకు పౌష్టికాహార సరఫరా పథకం ఉండేది. దానికి ఇప్పటికే కోత పెట్టారు. ఇలాంటివి చాలానే ఉన్నాయి. కానీ, మిలటరీ ఖర్చు మాత్రం పెరిగింది. దాన్ని ఏడాదికి ఒక లక్ష కోట్ల డాలర్ల నుంచి ఒకటిన్నర లక్షల కోట్ల డాలర్లకు పెంచమని ట్రంప్ కోరారు. ఆశ్చర్యమేంటంటే కోరిన దానికంటే ఎక్కువగా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. మిగిలిన దేశాలు కూడా ఇలా రక్షణ బడ్జెట్ పెంచేలా అమెరికా ఒత్తిడి తెచ్చి అమలు చేయిస్తోంది. మేము ఆర్థికశాస్త్రం చదువుకున్నప్పుడు గన్స్ అండ్ బటర్ మధ్య దేన్ని ఎంచుకోవాలనేదానిపై చర్చ జరిగేది. ఇప్పుడు తుపాకులకే ప్రాధాన్యం పెరిగింది. వెనెజువెలాపై బాంబులు వేసిన వెంటనే ట్రంప్ యంత్రాంగం అమెరికా బడ్జెట్‌ను పెంచేసింది. అమెరికాలోని ఆయుధ వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూర్చడమే ట్రంప్ లక్ష్యంలా కనిపిస్తోంది.

మితిమీరిన ఆయుధ పిపాస అమెరికాకు, మిగిలిన ప్రపంచానికి ఎలా నష్టం చేస్తుంది?

ప్రపంచం మొత్తం 2024లో 2.7లక్షల కోట్ల డాలర్లను మిలటరీపై ఖర్చు చేసింది. అందులో అమెరికా వాటానే 36శాతం. చైనా, రష్యా, జర్మనీ, ఇండియా, బ్రిటన్, సౌదీ అరేబియా, ఉక్రెయిన్, ఫ్రాన్స్, జపాన్‌ల మొత్తం వ్యయం కన్నా అది ఎక్కువ. 2025లో చైనా సైనిక బడ్జెట్ 30వేల కోట్ల డాలర్ల లోపే ఉంది. అమెరికా భాగస్వామ్య దేశాలు వాటి జీడీపీలో రక్షణ వ్యయాన్ని రెండు నుంచి అయిదు శాతానికి పెంచడానికి అంగీకరించాయి. అమెరికా, దాని మిత్ర దేశాలు మిగిలిన ప్రపంచమూ సైన్యంపై ఎక్కువ ఖర్చుపెట్టాల్సిన పరిస్థితిని తెచ్చిపెడుతున్నాయి. రక్షణ వ్యయం కట్టుతప్పడం వల్ల అగ్రరాజ్య అప్పులు రాబోయే దశాబ్ద కాలంలో 5.8లక్షల కోట్ల డాలర్ల మేర పెరగవచ్చు. యుద్ధం మిగిల్చే నష్టాల నుంచి బయటపడటానికి ట్రంప్ సుంకాలు పెంచితే సరిపోదు, భారీగా పన్నులు వేయాల్సి ఉంటుంది. వర్ధమాన, పేద దేశాల్లో పలు కార్యక్రమాల నిమిత్తం ఐరాసకు అగ్రరాజ్యం ఇచ్చే నిధులు యాభైశాతానికి పైగా తగ్గిపోయాయి. ఆయుధాల కోసం అప్పులు చేస్తుంటే సంక్షేమ కార్యక్రమాలకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది?

యుద్ధం వల్ల ఆహార ఎగుమతులు దెబ్బతింటాయా?

చమురును దిగుమతి చేసుకునే అన్ని దేశాలపైనా ప్రతికూల ప్రభావం ఉంటుంది. భారత్‌లో వృద్ధి రేటు పెరుగుతోంది. యుద్ధం దాన్ని కొద్దిమేర దెబ్బతీయవచ్చు. ఆహార ఎగుమతులకూ విఘాతం ఏర్పడుతుంది. వడ్డీరేట్లు పెరుగుతాయి. దక్షిణాసియా, ఆగ్నేయ ఆసియా దేశాలు... ముఖ్యంగా వియత్నాం, థాయ్‌లాండ్ వంటివి వ్యవసాయ ఉత్పాదకతను గణనీయంగా పెంచాయి. యుద్ధం మూలంగా భారత్, మలేసియా నుంచి ఆహార ఎగుమతులు క్షీణిస్తాయి. ఈ విషయంలో అమెరికా, నెదర్లాండ్స్‌లకూ నష్టం తప్పదు. కొన్ని రంగాలపై ప్రత్యక్షంగా, చాలావాటిపై పరోక్షంగా ప్రభావం ఉంటుంది.

# మీకు తెలియకుండానే.. కిడ్నీలు పాడవుతున్నయ్!




దేశంలో రాను రానూ కిడ్నీ సమస్యల బాధితులు పెరుగుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షకు పైగా కొత్త మూత్రపిండ వైఫల్యాల కేసులు బయటపడుతున్నాయి. దేశంలోనే కిడ్నీ సమస్యల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో సగటున 13 నుంచి 14 శాతం మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతుంటే.. తెలంగాణలో మాత్రం అది దాదాపు 17 శాతం. ఇది జాతీయ సగటు కన్నా చాలా ఎక్కువ.

### కిడ్నీ వ్యాధికి కారణాలు..

కిడ్నీ సమస్యలకు ప్రధాన కారణాలు హైబీపీ, మధుమేహం కాగా.. తెలంగాణలో ఈ రెండు సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్యశ్రీ, వైద్యారోగ్య శాఖల లెక్కలు వెల్లడిస్తున్నాయి.. రాష్ట్రంలో ఈ రెండు వ్యాధులతో బాధపడుతున్న వారు సుమారు 50 లక్షల మంది వరకు ఉన్నారని అంచనా. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, చక్కెర, ఉప్పు అధిక వినియోగం, ఊబకాయం వంటివి ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. కిడ్నీ జబ్బులను సైలెంట్ కిల్లర్ అని అంటారు.. చాలా మందిలో సమస్య బయటపడే సమయానికే మూత్రపిండాలు 70–80 శాతం పాడైపోయి ఉంటున్నాయి. 30 ఏళ్ల లోపు వారిలో కూడా మధుమేహం, హైబీపీ వంటి సమస్యలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నొప్పి నివారణ మాత్రలు, గ్యాస్–ఎసిడిటీ మందులు, అశాస్త్రీయ వైద్య విధానాలను ఆశ్రయించడం (ఆయుర్వేదిక్, హోమియోపతి, అల్లోపతి ఇలా అన్ని రకాల మందుల్నీ కలిపి వాడటం వంటివి కూడా) కిడ్నీ సమస్యలను మరింత పెంచుతున్నాయి. జన్యుపరమైన లోపాల వల్ల కూడా కిడ్నీ జబ్బుల బారిన పడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

### అజ్ఞాత కారణాలతో కిడ్నీ వైఫల్యం!

మారుతున్న జీవనశైలి, షుగర్, హైబీపీలతో పాటు తెలంగాణలో అజ్ఞాత కారణాల వల్ల సమస్యలు ఎక్కువయ్యాయి.. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో తెలియని కారణాల వల్ల దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి చాలా మంది పేదల్ని పట్టి పీడిస్తోంది. ఇక్కడి ప్రతి ఐదుగురిలో ఒకరు కిడ్నీ వ్యాధి బాధితులే.. తెలంగాణలోని పలు జిల్లాల్లో భూగర్భ జలాల ప్రభావం, వ్యవసాయ రసాయనాల వాడకం వంటి కారణాలతో యువత ఎక్కువగా కిడ్నీ సమస్యలని ఎదుర్కొంటున్నారు..

### డీహైడ్రేషన్‌తోనే అధిక ప్రమాదం..!

అధిక ఉష్ణోగ్రతల మధ్య వేడి వాతావరణంలో ఎక్కువ గంటలు పనిచేసే కార్మికులు రైతులు డీహైడ్రేషన్‌కి గురౌతారు. దాని వల్ల మూత్రపిండాలకు రక్త ప్రవాహం తగ్గి, దీర్ఘకాల నష్టం జరుగుతుంది. తగినంత నీరు తాగకపోవడం, ఉప్పు ఎక్కువగా వాడే జంక్ ఫుడ్ తినడం, నొప్పి నివారణ మందుల వాడకం కిడ్నీ సమస్యలకు కారణాలు.. పసర్లు, మూలికా వైద్యాలు మూత్రపిండాలకు హాని కలిగిస్తాయి. 40% మంది కిడ్నీ రోగులు అశాస్త్రీయ వైద్యవిధానాల్ని విశ్వసించి మందులు వాడినట్లు అధ్యయనాలు చూపిస్తున్నాయి. ఉద్దానం, నల్గొండ వంటి ప్రాంతాల్లో ప్రభుత్వాలు కిడ్నీ పరిశోధనా కేంద్రాలు, ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాయి. కానీ లక్షణాలు కనిపించే సమయానికే వ్యాధి ముదిరిపోయి ప్రమాద స్థాయికి చేరుకుని వుంటుంది. సీరమ్ క్రియాటినిన్, రక్తపోటు మానిటరింగ్, యూరిన్ ఆల్బుమిన్ వంటి సాధారణ పరీక్షల ద్వారా తొలి దశలోనే సమస్యని గుర్తించగలం. రొటీన్ స్క్రీనింగ్ అనివార్య నష్టాన్ని నివారించడానికి కీలక పాత్ర పోషిస్తుంది.

### మూత్రపిండాల సంరక్షణకు ఏం చేయాలి?

మూత్రపిండాల సమస్య లక్షణాలు కనిపించినప్పుడు మొదలవదు.. అంతకు ముందే మొదలవుతుందని ముందుగా గ్రహించాలి. మధుమేహం, హైపర్ టెన్షన్, కుటుంబ చరిత్ర వంటి రిస్క్ ఫ్యాక్టర్లను తెలుసుకోవాలి. రిస్క్ ఫ్యాక్టర్లు ఉంటే మూత్రపిండాల పనితీరు పరీక్షలు చేయించుకోండి. నొప్పి నివారణ మందులు, నియంత్రణ లేని సప్లిమెంట్లను దీర్ఘకాల వాడకాన్ని నివారించండి. శుభ్రమైన, సురక్షితమైన నీరు తాగండి. సమతుల ఆహారం తీసుకోండి. రోగ లక్షణాలు ముదిరిపోయే వరకు వేచి ఉండకుండా త్వరగా వైద్య సలహా తీసుకోండి. 30 ఏళ్లు దాటిన వారు ప్రతి సంవత్సరం కిడ్నీ పరీక్షలు (ావతీబఎ జతీమ్ఖఱఅఱఅవ, చేసుకోవాలి.

### కిడ్నీలు కాపాడుకోవడం మన చేతుల్లోనే..

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉష్ణ ప్రదేశాలు.. వేడి వాతావరణంలో మరీ ముఖ్యంగా బహిరంగ ప్రదే శాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతల మధ్య గనుల్లో కార్ఖానాల్లో పని చేసేవారు తగినంత నీరు తాగడం, ఉప్పు తగ్గించడం, సమతుల ఆహారం తీసుకోవడం అవసరం. సమస్య వచ్చిన తర్వాత డాక్టర్ల దగ్గరికి పరుగెత్తడం కంటే ముందు జాగ్రత్తలు పాటించడం మంచిది. డయాలిసిస్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల వరకూ పోకుండా కిడ్నీలు కాపా డుకోవడం మన చేతుల్లోనే ఉంది.

# ఉద్యోగులపై కక్షగట్టిన కాంగ్రెస్



కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లుగా ఉద్యోగులపై కక్షపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నది. అధికారంలోకి రావడానికి అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చింది. కానీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నేటివరకూ నెరవేర్చలేదు. ఆరు నెలల్లో ఉద్యోగులకు పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డుల మంజూరు, డీఏల విడుదల వంటి అనేక హామీలు మ్యానిఫెస్టోలో పెట్టింది. అధికారంలోకి రాగానే ఉన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలు తెచ్చి ఉద్యోగుల ఉసురు పోసుకుంటున్నది. ప్రజలు, ఉద్యోగుల మధ్య వైరుధ్యం సృష్టించడానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది. ఇందులో భాగంగానే 'మీకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఏ సంక్షేమ పథకాలు ఆపాలో చెప్పండి' అని ముఖ్యమంత్రి ప్రజలపై ఎదురు దాడి చేశారు. దేశంలోనే 5 విడతల కరువుభత్యం బకాయి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల్లో నమోదైంది.తెలంగాణ వార్తలు పీఆర్సీ ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వంగా గుర్తింపు పొందింది. రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. 2024 మార్చి నుంచి రిటైరైన ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బకాయిలు, వారు దాచుకున్న సొమ్ము కూడా ఇవ్వకపోవడంతో ఇప్పటికే 80 మంది అనారోగ్య, మానసిక సమస్యలతో మరణించారు. ఈ పరిణామాన్ని తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో దక్కిన అవమానాలే. 24,782 మంది ఉద్యోగులకు రావలసిన రూ.10 వేల కోట్లు ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇందుకోసం నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చి, రెండేండ్లలో రూ.2 వేల కోట్లు కూడా విడుదల చేయలేదు. కనీస వేతనం పొందని ఆశాలు, అంగన్‌వాడీలు, ఇతర శాఖల ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చినా నెలనెలా వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. అందరికీ ఒకటో తారీఖున వేతనాలు ఇస్తున్నామని గొప్పలు చెప్తున్న ప్రభుత్వ పెద్దలు 5 లక్షల మంది కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వరకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాల నుంచి 1.5 శాతం కోత పెట్టి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీని ప్రకారం.. ఏటా ఉద్యోగులు ఇచ్చే మొత్తం దాదాపు రూ.600 కోట్లు. ప్రభుత్వం కూడా రూ.600 కోట్లు విడుదల చేయాలి. ఉద్యోగుల జీతాల నుంచి ఠంచనుగా డబ్బు జమ అవుతుంది. కానీ ప్రభుత్వం రెగ్యులర్‌గా విడుదల చేస్తుందనే నమ్మకం లేదు. తాము దాచుకున్న డబ్బులు కూడా తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్న ప్రభుత్వం రూ.600 కోట్లు విడుదల చేస్తామని అనడం ఉద్యోగులకు నమ్మశక్యంగా లేదు. అందుకే ఒకేదఫాలో రూ.600 కోట్లు విడుదల చేసి, హెల్త్‌కార్డులు జారీ చేసి, వైద్యం కోసం కార్యాచరణ సిద్ధం చేయాలి. ప్రభుత్వ నిధులు ఖర్చయిన వెంటనే ఉద్యోగుల జీతాల నుంచి కోత పెట్టి, మిగిలిన నిధులు సేకరించాలి, విధివిధానాలు ఎప్పటికీ వస్తాయో తెలియదు. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో రెండుసార్లు పీఆర్సీ అమలు చేసింది. రాష్ట్ర సాధనలో 42 రోజుల సకల జనుల సమ్మె పాత్రను గుర్తించి 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చింది. కరోనా సమయంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రెండవ పీఆర్సీ కింద 30 శాతం ఫిట్మెంట్ ప్రకటించి అమలు చేసింది. మూడవ పీఆర్సీ సకాలంలో వేసి 5 శాతం మధ్యంతర భృతి ఇచ్చింది. కానీ రేవంత్ ప్రభుత్వం రెండేండ్లు దాటినా ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ఈనెల 16న బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గత రెండు బడ్జెట్‌లలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఎలాంటి కేటాయింపులు జరగలేదు. తాజా బడ్జెట్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బకాయిల కోసం రూ.15 వేల కోట్లు, పీఆర్సీ అమలు కోసం రూ.15 వేల కోట్లు, పెండింగ్‌లో ఉన్న 5 డీఏల కోసం, రాబోయే 2 డీఏల కోసం రూ.20 వేల కోట్లు కేటాయించాలి. మొత్తం కలిపి రూ.50 వేల కోట్లు కేటాయించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు బడ్జెట్‌లో పద్దులు ఉండాలి. లేకుంటే ప్రజాప్రతిఘటన తప్పదు.

# హరీష్ ఉస్తాద్.. పవన్, భూమిక మ్యాజిక్ ను మిస్ అయిపోయామా?



టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చెప్పిన ఒక ఆసక్తికరమైన విషయం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ఆ సినిమాకు మొదట అనుకున్న కథ పూర్తిగా భిన్నంగా ఉండేదని ఆయన ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఖుషీ మూవీ కంటిన్యూషన్ గా ఉస్తాద్ తీయాలనుకున్నానని తెలిపారు. పవన్ కెరీర్ లో ప్రత్యేక స్థానం సంపాదించిన చిత్రం ఖుషీ. ఆ సినిమాలో సిద్ధు- మధు పాత్రల మధ్య కనిపించిన లవ్, ఈగో, గొడవలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆ ఇద్దరి మధ్య జరిగే ఈగో క్లాష్లు ఇప్పటికీ అలరిస్తూనే ఉంటాయి. పవన్ కళ్యాణ్, భూమిక తమ న్యాచురల్ యాక్టింగ్ తో ఓ రేంజ్ లో అలరించారు. బేబీ పింక్ లెహంగాలో ఆకట్టుకుంటున్న బేబమ్మ.. లుక్స్ అదుర్స్! ాాంజవతీఅంవఎవత్ అయితే ఉస్తాద్ కోసం హరీష్ శంకర్ మొదట ఒక కథను సిద్ధం చేశారట. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. ఆ కథలో ఖుషీలో విడిపోయిన సిద్ధు, మధు ఇద్దరూ ఒకే కాలేజీలో లెక్చరర్లుగా పనిచేస్తారు. కానీ వారిద్దరి మధ్య పాత ఈగో అలాగే ఉంటుంది. దీంతో వారి మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు, ప్రేమ.. వాటితో స్క్రిప్ట్ ను తయారు చేసుకున్నారట. అంతేకాదు ఖుషి ఫ్లాష్ బ్యాక్ కు సంబంధించిన కొన్ని రిఫరెన్సులు కూడా కథలో ఉండేలా ప్లాన్ చేసినట్లు తెలిపారు. అయితే స్టోరీ రెడీ అయిన తర్వాత హరీష్ శంకర్ కు ఒక డౌట్ వచ్చిందట. పవన్ వంటి భారీ మాస్ ఇమేజ్ ఉన్న హీరో నుంచి అభిమానులు ఏమి ఆశిస్తారనే ప్రశ్న ఎదురైంది. అభిమానులు ఎప్పుడూ పవన్ నుంచి హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు, పవర్ ఫుల్ డైలాగులు, మాస్ ఎలిమెంట్స్ ఉన్న కమర్షియల్ ఎంటర్టైనర్ ఆశిస్తారని ఆయన భావించారు. చీకటి గదిలో నిక్కీ తంబోలి కష్టమేంటి? అలాంటి పరిస్థితుల్లో పూర్తిగా ఎమోషన్స్, ఈగో క్లాష్ల చుట్టూ తిరిగే కథ థియేటర్లలో అభిమానులను ఎంతవరకు శాటిస్ఫై చేస్తుందన్న అనుమానం కలిగిందేమో.. మాస్ ప్రేక్షకులు ఆశించే పవర్ ఫుల్ ఎలివేషన్లు, యాక్షన్ ఎపిసోడ్లు ఇందులో తక్కువగా ఉంటాయట. దీంతో రిస్క్ చేయకుండా ఆ కథను పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నారని హరీష్ శంకర్ తెలిపారు. ఆ తర్వాత కంప్లీట్ కమర్షియల్ కథను సిద్ధం చేసి ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆ సినిమాలో పవన్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాస్ ఎలిమెంట్స్, యాక్షన్ సన్నివేశాలు, అభిమానులను అలరించే డైలాగులు ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయని సమాచారం. అయితే ఒకవేళ మొదట అనుకున్నట్లుగా ఖుషి కథకు కొనసాగింపుగా సినిమా తెరకెక్కి ఉంటే.. పవన్- భూమిక మళ్లీ కలిసి లెక్చరర్లుగా కనిపించి ఉంటే.. ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతి కలిగేదేమో అన్న అభిప్రాయం ఇప్పుడు అందరిలో వ్యక్తమవుతోంది. ఏదేమైనా పవన్, భూమిక మ్యాజిక్ ను మిస్ అయిపోయామని ఇప్పుడు నెటిజన్లు అంటున్నారు.

# అతనంటే నాకు పిచ్చి ఇష్టం.. లవ్లీ బాయ్ అంటూ ప్రేమ కురిపించిన జబర్దస్త్ నటి



జబర్దస్త్ ద్వారా పాపులర్ అయిన వారిలో లేడీ కమెడియన్స్ కూడా చాలా మంది ఉన్నారు. జబర్దస్త్ షోలో స్కిట్స్ చేస్తూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వారిలో సత్య శ్రీ ఒకరు. జబర్దస్త్ లోనే కాదు పలు సినిమాల్లోనూ నటించింది ఈ చిన్నది. స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో, హీరోయిన్ ఫ్రెండ్స్ పాత్రల్లో నటించింది సత్య శ్రీ. రీసెంట్ గా రిలీజ్ అయిన నవీన్ పోలిశెట్టి నటించిన అనగనగా ఒకరాజు సినిమాలో హీరోయిన్ స్నేహితురాలిగా కనిపించింది ఈ ముద్దుగుమ్మ. ఇక ఇప్పుడు జబర్దస్త్ నుంచి బయటకు వచ్చి సినిమాల్లో బిజీ అయ్యింది సత్య శ్రీ. కాగా ఈ అమ్మడు ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను పంచుకుంది. సత్య శ్రీ మాట్లాడుతూ.. తనస్కూల్, కాలేజ్ రోజుల్లో చాలా మంది తనకు ప్రపోజ్ చేశారని, అయితే తాను వాటికి అంగీకరించలేదని ఆమె తెలిపారు. తన తండ్రి, అమ్మమ్మ చాలా స్ట్రిక్ట్, తన కుటుంబం గురించి తెలిసిన తర్వాత ఎవరూ తన వద్దకు వచ్చి మాట్లాడే సాహసం చేసేవారు కాదని సత్య శ్రీ చెప్పుకొచ్చింది. అయితే అప్పట్లో ఒక వ్యక్తి పదే పదే తన వెంటపడగా, తన తండ్రి జోక్యం చేసుకుని అతడిని పిచ్చి కొట్టుడు కొట్టారని, ఆ తర్వాత నుంచి ఆ వ్యక్తి తన జోలికి రాలేదని తెలిపింది. హైదరాబాద్?కు వచ్చిన తర్వాత తనకు ఎవరూ ప్రపోజ్ చేయకపోవడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందని తెలిపింది.

ఎట్లా ఉండేవాడివి ఇలా మారిపోయావేంటన్న..!!

ప్రస్తుతానికి పెళ్లి చేసుకోవాలనే ఆసక్తి తనకు లేదని సత్య శ్రీ స్పష్టం చేసింది. తన స్నేహితులు , గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు తనని ఆలోచింపజేశాయని తెలిపింది. ఆడపిల్లల ఆశలను అణచివేసి పెళ్లిళ్లు చేయడం, చదువులను మధ్యలోనే ఆపేయడం, చిన్న వయసులోనే వివాహాలు చేయడం వంటి సమస్యలు తనని తీవ్రంగా కలిచివేశాయని, మగవాడు సంపాదించాలి, ఆడవాళ్లు పెళ్లి చేసుకోవాలి అనే పాతకాలపు ఆలోచనలను సత్య శ్రీ వెతిరేకించింది. ఆడపిల్లలు కూడా తమ తల్లిదండ్రులను పోషించగలరని, తన కుటుంబానికి తానే దిక్కై చూసుకుంటున్నానని తెలిపింది. పెళ్లిపైన ఆలోచన లేదని.. ప్రస్తుతం తన దృష్టి మొత్తం తన కెరీర్? పైనే ఉందని, ముఖ్యంగా తన చెల్లి పెళ్లి చేయడమే తన ప్రధాన లక్ష్యమని సత్య శ్రీ తెలిపింది. అలాగే తనకు ఇండస్ట్రీలో చాలా మందిలో రామ్ పోతినేని అంటే చాలా ఇష్టమని, ఆయన చాలా లవ్లీ బాయ్ అని తెలిపింది. పండగ చేస్కో సినిమాలో ఆయనతో కలిసి పని చేయడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఆ సమయంలో ఒక ఫోటో అడగడానికి కూడా చాలా కష్టపడ్డానని సరదాగా గుర్తు చేసుకుంది.

# ఆ బ్లాక్ బస్టర్ సినిమాను అతను తప్ప మరెవరూ చేయలేరు.. ఓపెన్ గా చెప్పిన సుకుమార్



టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ ఇప్పుడు పాన్ ఇండియన్ డైరెక్టర్ గా మారారు. వరుసగా సినిమాలు చేస్తూ సక్సెస్ లు అందుకుంటున్నారు. పుష్ప , పుష్ప 2 సినిమాలతో సంచలన విజయాలను అందుకున్నారు సుకుమార్. ఇక ఇప్పుడు సుకుమార్ ఎవరోతో సినిమా చేయనున్నారా అని ఆసక్తి అందరిలో నెలకొంది. ఇదిలా ఉంటే సుకుమార్ ఓ హీరో గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఓ హీరో పై సుకుమార్ ప్రశంసలు కురిపించారు. ఇంతకూ సుకుమార్ చెప్పింది ఎవరి గురించంటే.. సుకుమార్ తెరకెక్కించిన సూపర్ హిట్ సినిమాల్లో రంగస్థలం సినిమా ఒకటి. రామ్ చరణ్ కెరీర్ లో ఈ సినిమా ఓ మైలు రాయిగా నిలిచింది. ఈ సినిమాలో చరణ్ నటనకు అందరూ ఫిదా అయ్యారనే చెప్పాలి. రంగస్థలం సినిమా విడుదలై ఏళ్లయినా, దాని ప్రభావం ఇంకా స్పష్టంగా కనిపిస్తుంది. సుకుమార్ ఓ ఇంటర్వ్యూలో రంగస్థలం సినిమాకు సంబంధించిన అనేక ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. రామ్ చరణ్ వంటి మాస్ హీరోకి కేవలం సైకిల్?పై సాధారణ ఎంట్రీ ఇవ్వాలనే నిర్ణయం వెనుక తన ఆలోచనను సుకుమార్ పంచుకున్నారు. అటువంటి ఇంట్రడక్షన్ వల్ల ప్రేక్షకులు నిరాశపడతారనే ఆలోచన తనకు రాలేదని, అది కథలో భాగంగా, హీరో దేనికోసం వెతుకుతున్నాడనే ఆసక్తి పెంచేలా ఉండాలని కోరుకున్నానని సుకుమార్ తెలిపారు. ఈ సినిమా రామ్ చరణ్ తప్పించి వేరే ఎవరూ చేయలేరు అని సుకుమార్ అన్నారు. చాలా మంది దర్శకులు తమ ప్రతి సినిమా గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని, అయితే తన విషయంలో అది వేరు అని ఆయన అన్నారు. ఒక దర్శకుడికి సినిమా పూర్తయిన తర్వాత కూడా, ఆ పాత్రకు మరెవరూ సరిపోలేరని, ఆ ఆర్టిస్ట్ తన మనసును పూర్తిగా ఆక్రమించేశాడని అనిపిస్తే, అది ఆ నటుడి గొప్ప విజయమని సుకుమార్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా రామ్ చరణ్ తనను పూర్తిగా ఆక్యుపై చేశారని ఆయన పేర్కొన్నారు. జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, తారక్ వంటి ఇతర స్టార్లతో రామ్ చరణ్?ను పోల్చడం సరైనది కాదని ఆయన అన్నారు. వివిధ నటులు వివిధ స్క్రిప్ట్?లు, కథలలో పని చేస్తారని, ఒకరి పనిని మరొకరితో పోల్చుకోవడం కరెక్ట్ కాదని ఆయన స్పష్టం చేశారు.



# అల్లు హీరో ఈసారి గట్టిగా ప్లాన్ చేయాల్సిందే..!

**అల్లు ఫ్యామిలీ హీరో అల్లు శిరీష్ కెరీర్ లో సరైన సక్సెస్ లేక సతమతమవుతున్నాడు.**

అల్లు ఫ్యామిలీ హీరో అల్లు శిరీష్ కెరీర్ లో సరైన సక్సెస్ లేక సతమతమవుతున్నాడు. ఓ పక్క అల్లు అర్జున్ హిట్టు మీద హిట్టు కొట్టడమే కాదు పుష్ప రాజ్ పాత్రతో తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మొదటి ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డ్ కూడా తీసుకొచ్చాడు. అలాంటి హీరో ఇంట్లో ఉండి కూడా శిరీష్ హీరోగా సక్సెస్ అవ్వలేకపోతున్నాడు. గౌరవం సినిమాతో ఎప్పుడో 2013 లోనే తెరంగేట్రం చేసిన అల్లు శిరీష్ ఎంట్రీ ఇచ్చి పుష్కర కాలం అవుతున్నా కూడా ఇప్పటికీ కెరీర్ స్ట్రాంగ్ చేసుకోలేదు. వెనక అల్లు అరవింద్ లాంటి స్టార్ ప్రొడ్యూసర్ ఉన్నా కూడా శిరీష్ కెరీర్ సక్సెస్ ట్రాక్ ఎక్కకపోవడం విశేషం. రాజా సాబ్ రిలీజ్ డేట్ ఫిక్స్.. అంచనాలు పెంచేసిన మారుతి అల్లు శిరీష్ తన ప్రయత్నాలు తాను చేస్తున్నా కూడా అవేవి ఆడియన్స్ కి ఎక్కట్లేదు. కెరీర్ లో కొత్త జంటతో జస్ట్ ఓకే అనిపించుకున్న శిరీష్, శ్రీరస్తు శుభమస్తు సినిమాతో సక్సెస్ అందుకున్నాడు. ఆ తర్వాత ఒక్క క్షణం, ఏబిసిడి, ఊర్వశివో రాక్షసివో ఇలా చేసిన సినిమాలన్నీ కూడా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సినిమా సినిమాకు రెండు మూడేళ్లు గ్యాప్ తీసుకుంటున్నా కూడా సక్సెస్ ఫాం లోకి రావట్లేదు అల్లు శిరీష్. చివరగా లాస్ట్ ఇయర్ బడ్డీతో మరోసారి తన లక్ టెస్ట్ చేసుకున్నాడు అల్లు శిరీష్. ఐతే అల్లు శిరీష్ నెక్స్ట్ సినిమా ప్రయత్నాల్లో ఉన్నారని తెలుస్తుంది. ఈసారి ఒక డిఫరెంట్ అటెంప్ట్ తో ఆడియన్స్ అందరినీ తన వైపుకి తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడట. సినిమా స్క్రిప్ట్ దశలోనే సర్ ప్రైజింగ్ గా ఉందని ఫిల్మ్ నగర్ టాక్. ఐతే ఈ సినిమా దర్శకుడు ఎవరు ఎలాంటి కాంబినేషన్ లో సినిమా వస్తుంది అన్న విషయాలు త్వరలో తెలుస్తాయి. %ూశ్రీంశీ =ముం% - తెలుసు కదా... టిల్లు మార్క్ ఎంటర్టైన్మెంట్ పక్కా..! అల్లు ఫ్యామిలీ హీరోగా శిరీష్ తను కూడా స్టార్ మెటీరియల్ అని ప్రూవ్ చేసుకోవాలని దాదాపు 12 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఐతే కరెక్ట్ లైన్ అన్నది దొరక్క ఇన్నాళు ఇబ్బంది పడ్డాడు. ఐతే నెక్స్ట్ సినిమా తన క్యారెక్టరైజేషన్ ఇంకా సినిమా అంతా వేరే లెవెల్ లో ప్లాన్ చేస్తున్నాడట. సో తప్పకుండా ఈ సినిమా సంథింగ్ స్పెషల్ గా ఉండబోతుందని తెలుస్తుంది. మరి అల్లు శిరీష్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏం అవుతుంది అన్నది చూడాలి.

## వాళ్లు బ్రెయిన్ వాష్ చేయడం

# వల్లే మళ్లీ ఇండస్ట్రీకి వచ్చా



చైల్డ్ ఆర్టిస్ట్ నిత్యా శెట్టి అందరికీ పరిచయస్తురాలే. కోడి రామకృష్ణ తెరకెక్కించిన దేవుళ్లు సినిమాలో బాల నటిగా నటించి ఎంతో మంచి ప్రశంసలు అందుకున్న నిత్యా ఆ తర్వాత లిటిల్ హార్ట్స్, దాగుడు మూతలు దండాకోర్ తో పాటూ పలు సినిమాల్లో నటించింది. 3 జీబఅవ 2025 12:00 చైల్డ్ ఆర్టిస్ట్ నిత్యా శెట్టి అందరికీ పరిచయస్తురాలే. కోడి రామకృష్ణ తెరకెక్కించిన దేవుళ్లు సినిమాలో బాల నటిగా నటించి ఎంతో మంచి ప్రశంసలు అందుకున్న నిత్యా ఆ తర్వాత లిటిల్ హార్ట్స్, దాగుడు మూతలు దండాకోర్ తో పాటూ పలు సినిమాల్లో నటించింది. ఆ తర్వాత హీరోయిన్ గా మారి నువ్వు తోపురా, ఓ పిట్టకథ లాంటి సినిమాలు చేసింది. తెలుగులో పాటూ కోలీవుడ్ లో కూడా నిత్యా సినిమాలు చేసింది. అక్కడ కూడా బాలనటిగా కొన్ని సినిమాలు చేసింది. చిన్నప్పుడు బాలనటిగా పలు సినిమాలు చేసిన నిత్యా ఆ తర్వాత చదువుల కోసం తన యాక్టింగ్ కెరీర్ కు ఫుల్ స్టాప్ పెట్టింది. బాగా చదివి జాబ్ కూడా చేసిందట. ఈ విషయాన్ని స్వయంగా నిత్యా శెట్టి రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది. - తెలుసు కదా... టిల్లు మార్క్ ఎంటర్టైన్మెంట్ పక్కా..! తాను చిన్నగా ఉన్నప్పుడు మొదట్లో డాక్టర్ అవాలనుకుందట నిత్యా. కానీ తన చుట్టాల్లో ఒక డాక్టర్ ఉన్నారట. అతను డాక్టర్ అంటే లైఫ్ లాంగ్ చదువుతూనే ఉండాలని చెప్పడంతో దాన్ని వదిలేసి బిటెక్ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చేశానని చెప్పింది. చదువయ్యాక కూడా తనకు యాక్టర్ అవాలనే ఆసక్తి కానీ, ఆలోచన కానీ లేదని నిత్యా శెట్టి తెలిపింది. అందుకే స్టడీస్ అయిపోయాక ఇన్ఫోసిస్ లో జాబ్ వస్తే మైసూర్ వెళ్లి జాబ్ లో జాయిన్ అయ్యానని, జాబ్ చేస్తూనే ఇస్రో ఎగ్జామ్ కూడా రాసి పాసయ్యానని, ఇస్రోలో ఆఫర్ వస్తే వద్దనుకుని ఇన్ఫోసిస్‌లోనే ఉండిపోయానని, ఇన్ఫోసిస్ లో ఎంప్లాయ్ అవార్డ్స్ కూడా అందుకున్నానని, అక్కడ ఆఫీస్ లో ని కొలీగ్స్ నువ్వు ఒకప్పుడు ఆర్టిస్టువి కదా సినిమాలు చేసుకోవచ్చు కదా అని బ్రెయిన్ వాష్ చేయడంతో జాబ్ కు రిజైన్

# నన్ను ఆ హీరో పాప అని పిలుస్తాడు.. చాలా మంది వ్యక్తి అతను.. శ్రీదేవి విజయ్ కుమార్ ఆసక్తికర కామెంట్స్



శ్రీదేవి విజయ్ కుమార్.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేని హీరోయిన్. ఒకప్పుడు తెలుగులో విపరీతమైన క్రేజ్ ఉన్న హీరోయిన్. ప్రభాస్ హీరోగా పరిచయం అయిన సినిమా ఈశ్వర్. ఇందులో కథానాయికగా శ్రీదేవి విజయ్ కుమార్ కథానాయికగా నటించింది. ఫస్ట్ మూవీతోనే అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత తెలుగులో నిరీక్షణ సినిమాతో మరోసారి సినీప్రియులను మెప్పించింది. కానీ ఈ బ్యూటీకి అంతగా అవకాశాలు రాలేదు. దీంతో తమిళంలో వరుస సినిమాలు చేస్తూ అక్కడే సెటిల్ అయ్యింది. ప్రస్తుతం టీవీ షోలతో మెప్పిస్తుంది ఈ చిన్నది. పలు టీవీ షోల్లో జడ్జ్ గా కనిపిస్తూ ఆకట్టుకుంటుంది. అలాగే ఇటీవల సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చింది. గతంలో శ్రీదేవి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ ఇంటర్వ్యూలో ఆమె ప్రభాస్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ప్రభాస్ చాలా మంచి మనిషి, అందరిని ఆప్యాయంగా పలకరిస్తాడు. అందుకే అతన్ని డార్లింగ్ అని పిలుస్తారు అని శ్రీదేవి తెలిపింది. ప్రభాస్ ఇతరులకు వడ్డించడం అంటే చాలా ఇష్టం. ఆయన చిన్నతనం నుంచే ఉన్న లక్షణం, ఆయన కుటుంబ సభ్యులు కూడా ఇతరులు భోజనం తినడం చూసి సంతోషిస్తారని శ్రీదేవి తెలిపారు. ప్రభాస్ తాను ఎక్కువ ఆహారం తీసుకోకపోయినా, అతిథులు సంతృప్తిగా తినేలా చూస్తారని ఆమె తెలిపారు. ఆయన వంటకాల గురించి వివరించే తీరు చాలా ఆసక్తికరంగా ఉంటుందని శ్రీదేవి గుర్తు చేసుకున్నారు. ప్రభాస్ స్వయంగా నాన్?వెజ్ ప్రియుడని, ఆయనతో కలిసి భోజనం చేసిన రోజులు "కిడ్స్" లాగా చాలా సరదాగా గడిచాయని ఆమె చెప్పారు. ప్రభాస్?తో తనకున్న వ్యక్తిగత అనుబంధం గురించి మాట్లాడుతూ.. ప్రభాస్ తనను శ్రీ లేదా పాప అని పిలిచేవారని, శ్రీదేవి అని ఎప్పుడూ పిలవలేదని తెలిపారు. ప్రభాస్ బాహుబలితో ఒక పాన్ ఇండియా స్టార్?గా మారినప్పటికీ, తామింకా ఒకరితో ఒకరు టచ్?లోనే ఉన్నామని శ్రీదేవి అన్నారు. ఆయన ఎదుగుదల పట్ల ఆమె ఎంతో గర్వంగా ఉందని శ్రీదేవి అన్నారు. ఎవరూ ఊహించని స్థాయిలో ఆయన స్టార్?డమ్ సాధించారని, ఇది ఆయన మంచితనానికి దేవుడిచ్చిన ఆశీర్వాదమని ఆమె అన్నారు. ప్రభాస్ ప్రస్థానం ఒక అందమైన ప్రయాణమని, భవిష్యత్తులో ఆయన ఇంకా గొప్ప విజయాలు సాధిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభాస్ సినిమాల ఎంపికపై మాట్లాడుతూ, ఆయన ఇమేజ్?ను మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా, సాహో వంటి విభిన్న పాత్రలను ప్రయత్నించడం చాలా గొప్ప విషయమని శ్రీదేవి ప్రశంసించారు. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

## డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు...

### పెద్దపల్లి డీసీపీ హెచ్చరిక...



గోదావరిఖని//**మార్చి 12 (ఆకాంక్ష) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల ప్రజలను ఒకేచోట సమీకరించి పిల్లల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, ఎస్.పి. నాయక్ బంజారా పాల్గొన్నారు. డీసీపీ బి.రామ్ రెడ్డి, మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నదని హర్షంతో హెచ్చరించారు. యువత చెడు స్నేహాలు మరియు ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిస అయినప్పటి తర్వాత ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతినడం సహజమని వివరించారు.డీసీపీ బి.రామ్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సమాజానికి కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.అలాగే, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించవలసిన అవసరం ఉందని చెప్పారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. కార్యక్రమంలో విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచనలిచ్చారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీసీపీ సూచించారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు.అలాగే, 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు పాటించడం ముఖ్యమని డీసీపీ అన్నారు. హెల్మెట్ ధరించడం, మితిమీరిన వేగంతో వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించడం వంటి నియమాల పాటించడం ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలదని చెప్పారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి, ఎంవీఐ రామగుండం సంతోష్ రెడ్డి, అంతర్గాం మండల సర్పంచులు, స్థానిక యువత, విద్యార్థులు సహా 300 మంది ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సీ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ...




నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 12 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని లట్టుపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జి. శ్రీకాంత్ పంపిణీ చేశారు.డా. శ్రీకాంత్ విద్యార్థులకు కష్టపడి చదివి ఎస్ఎస్సీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గౌరవం తెచ్చేలా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు నాగమణి, మధులత, యాదగిరి, భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శివలీల, చంద్ర గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మానవ జీవితకాలం కంటి చూపును సంరక్షించుకోవాలి ..

### ఆప్తాలమిక్ అధికారి కోట్ర బాలాజీ...




నాగర్ కర్నూల్//**మార్చి 12 (ఆకాంక్ష) :** మానవ జీవిత కాలం పాటు ప్రతి ఒక్కరూ కంటి దృష్టిని 100% సంరక్షించుకోవాలని నాగర్ కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కోట్ర బాలాజీ అన్నారు. గ్లూకోమా నీటి కాసుల వ్యాధి వారోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తూడుకుర్తికి చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన శాఖ వారి ఆధ్వర్యంలో గురువారం నాడు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.అనంతరం వ్యాధి లక్షణాలు తీవ్రత పై అవగాహన కల్పించారు.నిత్య భోజనంలో విటమిన్ ఏ సంబంధిత ఆహారాన్ని ప్రతి ఒక్కరు అధిక మొత్తంలో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్వి ప్రసాద్ తూడుకుర్తి ఆస్పత్రి పరిపాలనాధికారి ప్రేమ్ కుమార్ సిబ్బంది రాజు, లక్ష్మీకాంత్ రెడ్డి,లైన్స్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, కార్యదర్శి సురేష్, వాకింగ్ వండర్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు పడిగే తిరుపతయ్య మరియు సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం...



నాగర్ కర్నూల్//**మార్చి 12 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్‌లోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం సందర్భంగా ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి నాయక్ మాట్లాడుతూ 99 రోజుల ఆరోగ్య మిషన్‌ను నాలుగు దశలుగా అమలు చేయనున్న కార్యాచరణ ప్రణాళికను ప్రజా ప్రతినిధులకు వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహించనున్న 30 రకాల ఆరోగ్య పరీక్షలు, వడదెబ్బ కారణాలు, నివారణ చర్యలు మరియు ప్రథమ చికిత్సపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో ఆరోగ్య మిషన్ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజా ప్రతినిధులందరూ సహకరించాలని ఆయన కోరారు.

## శీర్షిక: ప్రకృతి గర్భగుడి




**మార్చి 12 (ఆకాంక్ష) :**మన హృదయం ప్రకృతి గర్భగుడిగా మారిన వేళ, వర్షపు చినుకులు అభిషేకాలై జలజలా కురిశాయి. గాలుల సున్నిత నాదం మంత్రోచ్చారణై పలికిన వేళ, పక్షుల గానధారలు ఘంటానాదాలై మార్మోగాయి. భూమి ఒడిలో మొలిచిన ప్రతి పచ్చ మొగ్గ, దైవసాన్నిధ్యపు మౌన ప్రతిమగా నిలిచింది. సూర్యకిరణాలు హారతులై వెలుగులు చిందించగా, చంద్రకాంతి కరుణా ప్రసాదంలా జాలువారింది. కానీ మనిషి మనసులో మొలిచిన స్వార్థపు ముళ్లు ఆ ప్రకృతి గర్భగుడిని గాయపరిచాయి. అసూయ అనే అగ్నికణం ఎగసి పడిన వేళ హృదయ పవిత్రత బూడిదగా మారింది. అహంకారం అనే అంధకారం కమ్ముకున్నప్పుడు ఆత్మదీపం మసకబారింది. ద్వేషం అనే విషగాలి వీచిన క్షణంలో జీవన వనమే వాడిపోయింది. అడవులను నరికిన కత్తుల ధ్వని మనిషి ఊపిరినే మూలం నుంచి కోసేసింది. పక్షుల గానాలు నిశ్శబ్దంలో కలిసిపోతూ ప్రకృతి ఆలయం శూన్యంగా మారింది. మన హృదయం మళ్లీ పవిత్రమైతేనే ప్రకృతి గర్భగుడి తిరిగి వెలుగుతుంది. మన ప్రేమే హారతి, మన కరుణే పూజగా మారితే ఈ భూమి మళ్లీ దైవాలయంగా వికసిస్తుంది. పకృతిని కాపాడాలని కోరుకుంటూ... శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి). మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రం చరవాణి 9347042218

## ప్రజా పాలనతో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలి...

### మంత్రి జూపల్లి కృష్ణారావు...









నాగర్ కర్నూల్//**మార్చి 12 (ఆకాంక్ష) :**ప్రజా పాలనను సమర్థవంతంగా అమలు చేసి నాగర్ కర్నూల్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా నిలపాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేసి జిల్లాకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకు రావాలని సూచించారు.గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అవగాహన సదస్సును మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజా పాలనను ఆదర్శంగా నిలపాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో ప్రజాప్రతినిధులు ఉదయం 6 గంటలకు మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న అకాల మరణాలు ఆందోళనకరమని మంత్రి పేర్కొన్నారు. రోడ్డు భద్రత, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అలాగే కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులను పెళ్లి జరిగిన వారం రోజుల్లోనే ఆన్లైన్‌లో నమోదు చేసి 20 రోజుల్లో మంజూరు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల నుండి వచ్చే ప్రతి దరఖాస్తును 15 రోజుల్లో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా రిసిప్ట్ ఇవ్వాలని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేయడానికి ప్రోత్సహించాలని తెలిపారు.భూ భారతి దరఖాస్తులను రానున్న 20 రోజుల్లో పరిష్కరించేలా ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. సర్పంచులు ఈ 99 రోజుల కార్యాచరణను ఒక మంచి అవకాశంగా తీసుకుని ప్రజల్లో గుర్తింపు పొందేలా పనిచేయాలని సూచించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టే పది ముఖ్య అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయిలో గ్రామసభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి సమావేశాలు, మే 2న నియోజకవర్గ స్థాయి సమావేశాలు, మే 22న జిల్లా స్థాయి సమావేశాలు, జూన్ 2న రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అంశానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి గ్రామ స్థాయిలో అమలును పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం అంశాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.గ్రామాలు మున్సిపాలిటీలలో తడిపొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామాల్లోనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నాగర్ కర్నూల్ జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు ప్రజలతో మరింత సత్సంబంధాలు ఏర్పరుచుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి 15 కోట్ల రూపాయలతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లకు పైగా కాలంలో ప్రతి ఇంటికి కనీసం ఒక సంక్షేమ పథకం చేరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ పట్టణ అభివృద్ధికి 55 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా పరిషత్ సీఈఓ దేవసహాయం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, ఆర్డీవో సురేష్ బాబు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అవగాహన సదస్సు అనంతరం ప్రజాప్రతినిధులకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని పది అంశాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణ సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటల ద్వారా అవగాహన కల్పించారు.

## ఓదెలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ...

### భయపడకుండా ప్రశాంతంగా పరీక్షలు

### రాయాలి : డీసీపీ బి. రామ్ రెడ్డి...




ఓదెల//**మార్చి 12 (ఆకాంక్ష) :**పదో తరగతి పరీక్షలను భయపడకుండా, ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఐపీఎస్ విద్యార్థులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థుల భద్రతతో పాటు డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పోత్కపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఓదెల మండలంలోని ఓదెల మోడల్ స్కూల్‌లో పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి భయాలు, ఆందోళనలు లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. భయం మరియు ఒత్తిడిని అధిగమించి ధైర్యంగా




ముందుకు సాగితే విజయాన్ని సులభంగా సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని, పదో తరగతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మొదటి మెట్టు అని గుర్తుంచుకోవాలని అన్నారు. చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు మరియు తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. చిన్న చిన్న విషయాలకు ఆవేదన చెందకుండా సానుకూల ఆలోచనలతో చదువుపై దృష్టి పెట్టాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, పెన్లు వంటి పరీక్షా సామగ్రిని డీసీపీ బి. రామ్ రెడ్డి మరియు పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఎగ్రామీణ ప్రాంతాలకు చెందిన చాలా మంది విద్యార్థులు రైతు కుటుంబాలకు చెందినవారే కావడంతో వారికి ప్రోత్సాహం కలిగించే ఉద్దేశంతో ఈ పరీక్షా సామగ్రిని అందజేస్తున్నామని తెలిపారు.కార్యక్రమం అనంతరం డీసీపీ, ఏసీపీ మరియు ఇతర పోలీస్ అధికారులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి,పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్, పోలీస్ సిబ్బంది, ఎంఈఓ వై. రమేష్, మోటివేషనల్ స్పీకర్ నరసింహా రెడ్డి, జడ్పీహెచ్ఎస్ ఓదెల హెచ్ఎం పద్మ, జడ్పీహెచ్ఎస్ పోత్కపల్లి హెచ్ఎం బి. సాంబయ్య, జడ్పీహెచ్ఎస్ కొలనూరు హెచ్ఎం ఎన్. సుదాస్, జడ్పీహెచ్ఎస్ కనగర్తి హెచ్ఎం వై. రమేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్, కేజీబీవీ ఓదెల టీచర్ కే. జ్యోతి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేను అడ్మిట్ చేసుకోను...

### నువ్వు ఎవరికి కంప్లైంట్ చేసుకుంటావో చెప్పుకో...

### వేములవాడ ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ నర్స్ మాటలు...

### 108 సిబ్బందితో డ్యూటీ నర్సు మాటలు...

### వేములవాడ ఏరియా ఆసుపత్రిలో అమానవీయ ఘటన...



వేములవాడ//**మార్చి 12 (ఆకాంక్ష) :**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన గర్భిణీకి సరైన చికిత్స అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన ఘటన స్థానికంగా ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది.రుద్రంగి మండలానికి చెందిన ఓ గర్భిణీకి అకస్మాత్తుగా ప్రసవ వేదనలు ప్రారంభమవడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ సాయంతో ఆమెను వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో గత 45 రోజులుగా గైనకాలజిస్ట్ అందుబాటులో లేరని సిబ్బంది చెప్పి ఆమెను అడ్మిట్ చేసేందుకు నిరాకరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అత్యవసర పరిస్థితి ఉన్నప్పటికీ సరైన వైద్యసేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గర్భిణీని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు రిఫర్ లెటర్ ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరగా డ్యూటీలో ఉన్న నర్సు బాధ్యతా రాహిత్యంగా స్పందించడంతో పాటు 108 అంబులెన్స్ సిబ్బందిపై కూడా దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ ఎందుకు లేరని ప్రశ్నించగా "ఉదయం వచ్చి సూపరింటెండెంట్‌ను అడుగు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు బాధితులు పేర్కొన్నారు.ఆసుపత్రి సిబ్బంది సహకరించక పోవడంతో గర్భిణీ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అత్యవసర సమయంలో తమ వద్ద డబ్బు కూడా లేదని, ఈ పరిస్థితిలో ఏం చేయాలో తెలియకపోతున్నామని గర్భిణీ తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు. చివరకు పరిస్థితి విషమించడంతో గర్భిణీని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌ను తక్షణమే నియమించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కూడా ఈ విషయంపై స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు సమాచారం.

## పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ధాన్యం లోటు వ్యవహారం బహిర్గతం...



పెద్దపల్లి//**మార్చి 12 (ఆకాంక్ష) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ ధాన్యం లోటు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెద్దపల్లి పట్టణానికి చెందిన "శ్రీ విజయశ్రీ" రైస్ మిల్లులో రూ.4.49 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం లోటు ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అధికారుల వివరాల ప్రకారం, పెద్దపల్లి సుభాష్‌నగర్‌కు చెందిన కొమురవెల్లి రాజేందర్ (తండ్రి కిష్టయ్య) "శ్రీ విజయశ్రీ" రైస్ మిల్లును నిర్వహిస్తూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా కోసం టీజీఎస్‌సీఎస్‌సీఎల్ సంస్థతో ఒప్పందం చేసుకుని ధాన్యం నిల్వలకు సంబంధించి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన నాయబ్ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) పెద్దపల్లి జి. రవీందర్, ఎం. మహేష్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ బి. లక్ష్మీనారాయణలు మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా రికార్డుల ప్రకారం ఉండాల్సిన ధాన్యాన్ని పరిశీలించగా మొత్తం 17,406.86 క్వింటాళ్ల ధాన్యం లోటు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ధాన్యం విలువ ప్రతి క్వింటాల్‌కు రూ.2,585.03 చొప్పున మొత్తం రూ.4,49,45,043గా ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి అందించాల్సిన ధాన్యాన్ని బియ్యం రూపంలో తిరిగి సమర్పించాల్సి ఉండగా, రికార్డులను ఎవరూ పరిశీలించరని భావించి కొంత ధాన్యాన్ని అక్రమంగా విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని మోసం చేసి లబ్ధి పొందినట్లు భావించి సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు రైస్ మిల్లర్ కొమురవెల్లి రాజేందర్‌పై పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నల్లగొండ జిల్లా తహసీల్దార్‌కు అరెస్ట్ వారెంట్...

## హెచ్చార్సీ ఆదేశాలను లెక్కచేయక పోవడంతో కఠిన చర్యలు...


TELANGANA HUMAN RIGHTS COMMISSION
GRUHAKALPA COMPLEX, MJ ROAD, HYDERABAD - 500001
HRC.No. 2313/2025
WARRANT OF ARREST
To
The Superintendent of Police,
Nalgonda District,
Telangana 508001.
Whereas, the Tahsildar, Tirumalagiri Sagar Mandal, has been duly issued repeated reminders and a conditional order dated 09.12.2025 to submit report before the Commission on 18.02.2026 at 11:00 AM, but has failed to submit report before the Commission on the said date and time.
You are hereby ordered to arrest and bring the said Tahsildar, Tirumalagiri Sagar Mandal, before this Commission on 13.04.2026 at 11:00 AM. In the event of furnishing of sureties by the said individual to your satisfaction, no arrest is warranted.
You are further ordered to return this warrant on or before 13.04.2026 with an endorsement certifying the day on and the manner in which it has been executed, or the reason why it has not been executed.
Given under my hand and the seal of the Court.
Dated this, the 18th Day of February, 2026.
MEMBER (JUDICIAL)

నల్లగొండ//**మార్చి 12 (ఆకాంక్ష) :** నల్లగొండ జిల్లాలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. తిరుమలగిరి (సాగర్) మండల తహసీల్దార్ అనిల్‌పై హెచ్చార్సీ అరెస్ట్ వారెంట్ జారీ చేయడం కలకలం రేపింది. ఓ భూ వివాదం కేసులో పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపిస్తూ బాధితుడు హెచ్చార్సీని ఆశ్రయించగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.భూ వివాదానికి సంబంధించిన ఫిర్యాదుపై పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని హెచ్చార్సీ గతంలోనే ఎమ్మార్వో అనిల్‌ను ఆదేశించింది. అయితే ఆదేశాలను బేఖాతరు చేస్తూ నివేదిక సమర్పించక పోవడంతో కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ స్పందించక పోవడాన్ని నిర్లక్ష్యంగా పరిగణించిన హెచ్చార్సీ కఠిన నిర్ణయం తీసుకుంది. తహసీల్దార్ అనిల్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషన్ ఆయనపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. సంబంధిత అధికారిని అరెస్ట్ చేసి తమ ముందుకు హాజరుపరచాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఈ ఘటన నల్లగొండ జిల్లా రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది. అధికారులపై హెచ్చార్సీ తీసుకున్న కఠిన చర్యలతో ప్రభుత్వ శాఖల్లో బాధ్యతాయుత వ్యవహారం అవసరమనే సందేశం వెళ్లిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### కెసిఆర్, హరీశ్‌రావును

# ఇబ్బంది పెట్టేందుకే కమిషన్ వేశారు...

కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ...



హైదరాబాద్//**మార్చి 12 (ఆకాంక్ష)** :కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ.. మాజీ సిఎం కెసిఆర్, హరీశ్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్‌కె జోషి పిటిషన్లు దాఖలు చేశారు. కెసిఆర్, హరీశ్‌రావు తరపున న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇప్పటికే ప్రభుత్వం, కమిషన్ తరపున వాదనలు పూర్తయ్యాయి. కెసిఆర్, హరీశ్‌రావును ఇబ్బంది పెట్టేందుకే కమిషన్ వేశారని న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగా వీరిద్దరిని లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. ఇద్దరిపైనా ఇప్పటికే దుష్ప్రచారం చేశారని తెలిపారు.

### జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

# ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం...

20 ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను హత్య చేయాలనుకుంటున్నా...

పోలీసుల దర్యాప్తులో దుండగుడు వెల్లడి...



న్యూఢిల్లీ//**మార్చి 12 (ఆకాంక్ష) :** జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా పై బుధవారం హత్యాయత్నం జరిగింది. ఆయన ఓ పెళ్లి వేడుకలో పాల్గొని, వేదిక నుంచి తిరిగి వస్తుండగా ఓ దుండుగుడు ఆయనపై పాయింట్ బ్లాంక్ రేంజ్ నుంచి కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. కానీ వెంటనే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై పక్కకు లాగడంతో బుల్లెట్ గురితప్పింది. తాను 20 ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను హత్య చేయాలనుకుంటున్నానని పోలీసుల దర్యాప్తులో దుండగుడు వెల్లడించడం గమనార్హం.ఘటనా స్థలంలోనే దుండగుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతడు జమ్మూలోని పురాని మండి ప్రాంతానికి చెందిన 63 ఏళ్ల కమల్ సింగ్ జమ్వాల్‌గా గుర్తించారు. పోలీసుల దర్యాప్తు సందర్భంగా నిందితుడు.. తాను 20 ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను చంపాలని చూస్తున్నానని చెప్పినట్లు వెల్లడించారు.'నేను ఫరూఖ అబ్దుల్లాను చంపాలని 20 ఏళ్లుగా చూస్తున్నా. ఇప్పుడు నాకు ఆ అవకాశం దొరికింది. కానీ అతడు చావలేదు. అతడు బతికిపోయాడు' అని పోలీసులు దర్యాప్తులో నిందితుడు చెప్పాడు. ఎందుకు చంపాలనుకుంటున్నావని ప్రశ్నించగా నా వ్యక్తిగత కారణం ఉందని అన్నాడు. పిస్టల్ ఎవరిది అని ప్రశ్నించగా తనదే అని పేర్కొన్నాడు.బుధవారం పెళ్లికి హాజరైన ఫరూఖ్ అబ్దుల్లా.. జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురిందర్ చౌధరి, ముఖ్యమంత్రి సలహాదారు నజీర్ అస్లాం వాని, ఇతర నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులతో కలిసి వేదిక నుంచి తిరిగి వస్తుండగా కమల్ సింగ్ హత్యాయత్నం చేశాడు. ఫరూక్ అబ్దుల్లా మెడపై పిస్తోల్ గురిపెట్టాడు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ అతడిని లాగేయడంతో బుల్లెట్ గురితప్పింది.

### గురుకుల కళాశాల విద్యార్థులకు

# పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ...





గోదావరిఖనిటౌన్//**మార్చి 12 (ఆకాంక్ష) :** పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రామగుండం గురుకుల మహిళా కళాశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం సలహాదారులు సురేష్ సహకారంతో గురుకుల పేరంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గురుకుల పేరంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి సతీష్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, రామగుండం ఎస్‌ఐ సంధ్య హాజరై పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ఈ దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని అన్నారు. చదువు జీవితానికి బలమైన పునాది అని, పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాసి మంచి జీపీఏ సాధించాలని సూచించారు.చదువుకున్న వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొంటూ, విద్యార్థులకు ఎల్లప్పుడూ తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. చదువులో లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎస్‌విపి రజిత, జేవిపి రజిత, పేరంట్స్ కమిటీ చైర్మన్ ఉషా రాణి మురళీ, ప్రధాన కార్యదర్శి కె. భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ మాధవి, కోశాధికారి బాదె అంజలి, కార్యదర్శులు సంధ్యారాణి, రజిత, పేరంట్స్ కమిటీ నాయకులు నవీన, శైలజ, కళ్యాణి, జ్యోతి, పేరంట్స్ కమిటీ జిల్లా నాయకులు సంపత్, సతీష్‌తో పాటు ఉపాధ్యాయులు తేజశ్విని, నర్మద, రజిత, సునీత, సమత, మానస, శ్రీదేవి, శ్రీలత, హెచ్ఎస్ మేడమ్ తదితరులు పాల్గొన్నారు.కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయ బృందం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# మార్కులే జీవితము కాదు...

## ఒత్తిడిలకు గురికాకండి

## డాక్టర్ లిల్లీ మేరి



కొడంగల్//**మార్చి 12 (ఆకాంక్ష) :** విద్యార్థి దశలో అత్యంత కీలకమైన మలుపు పదవ తరగతి. పరీక్షల్లో ప్రతిభను చూపాలని తపన విద్యార్థులలో ఉండాలి. చదువుతున్న సబ్జెక్టు పై పూర్తిస్థాయి పట్టు సాధించాలి .ఇక్కడి నుంచే ప్రతి ఒక్కరి భావి ప్రణాళికలు మొదలవుతాయి. తుది పరీక్షల ఒత్తిడి ఎక్కువగానే ఉంటుంది. దీన్ని జయించలేక కొందరు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి బారిన పడకుండా సునాయాసంగా పదో తరగతి ఉత్తీర్ణుల అవ్వాలంటే ముందస్తు ప్రణాళికతో సన్నద్ధం కావాలి. ప్రాథమిక అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించినట్లయితే విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురికారు. ఆందోళన చెందకుండా విషయాలు పై పట్టు సాధించేందుకు ఏకాగ్రతతో చదువుపై దృష్టి సాధించాలి. ఇందుకోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించాలి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మేమున్నామనే భరోసా అందించాలని కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు

పరీక్షల తర్ఫీదుకు కొన్ని ముఖ్య సూత్రాలు...

పరీక్షలను ఒక పండగల భావించాలి. మీలోని ప్రతిభను వెలికి తీయటమే అన్ని పరీక్షల లక్ష్యం అనేది గుర్తించాలి. వివేకానందుని బోధలను అనుసరించాలి. పరీక్షలకు ముందు బెరుకు సహజము. మనో ధైర్యము పెంచుకోవడం ద్వారా ఈ సమస్యను మీరు గమించవచ్చు. మనో నిబ్బరము, పరీక్షల నుంచి మీ దృష్టిని మల్లిస్తున్న అంశాలను గుర్తించి, తొలగించుకుంటే సరిపోతుంది. యోగా, మీ బుద్ధి, మనసు, దేహాలను ఏకోన్ముఖం చేసి మీ కేంద్రీకరణ శక్తిని పెంచుతుంది. మీ ప్రత్యర్థిని మీలోనే కనుగొనండి. మీ తల్లిదండ్రుల ఉద్దేశాలను ప్రశ్నించకండి. ప్రకృతితో గడపండి. మంచి పుస్తకాలు చదవండి. మీకు ఇష్టమైన పనులు చేయండి అని కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి అన్నారు

బద్ధకాన్ని వీడాలి...

బద్ధకాన్ని, వాయిదా తత్వాన్ని వీడి చదువు పైన పూర్తి దృష్టి సాధించండి. కాలం విలువైనది. పరీక్షా సమయాలలో ప్రతిక్షణం కీలకమైనది. తెల్లవారు జామున నాలుగు గంటలకే లేచి కఠినమైన విషయాలను చదువుకుంటే బాగా అవగతం అవుతాయి. బాగా చదువుకోవడానికి ఏకువజాము సమయము అత్యంత అనుకూలము. చదువుకునే గది, వాతావరణం ప్రశాంతంగా ఉండాలి. చదివే తప్పుడు సృష్టి మరలితే విలువైన సమయము వృధా అవుతుంది. చదువుకు ఆటంకం కలిగించే అంశాలను గుర్తించి వాటికి దూరంగా ఉండండి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో వాదనలు, ఘర్షణలకు దిగవద్దు. మానసికంగా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలి అని లిల్లీ మేరి పేర్కొన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధం...

ఆత్మవిశ్వాసమే లక్ష్యసాధనకు ప్రధాన ఆయుధం. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులు, సన్నిహితుల సూచనలు ప్రణాళికా భద్ద ప్రిపరేషన్కు దోహదపడతాయి. భయాన్ని వీడి, ఆత్మవిశ్వాసంతో పరీక్ష హాల్లోకి వెళ్ళగలిగితే సగం విజయం సాధించినట్టే. మనసును ప్రశాంతంగా ఉంచుకొని ఒత్తిడికి గురికాకుండా పరీక్ష హాల్లో ప్రశ్నపత్రం తీసుకోగానే క్షుణ్ణంగా చదివి వెంటనే ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. బాగా వచ్చిన ప్రశ్నలు, కొద్ది లోపంతో వచ్చిన ప్రశ్నలు, రాని ప్రశ్నలను గుర్తించి మొదటగా బాగా వచ్చిన ప్రశ్నలనే రాయాలి. తరవాత కొద్దిగా లోపంతో వచ్చిన ప్రశ్నలు, ఆ తరువాత మిగతా వాటి గురించి ఆలోచించాలి. సమయాన్ని గమనిస్తూ అన్ని ప్రశ్నలకు జవాబులు రాయగలిగేలా జాగ్రత్త పడాలని డాక్టర్ లిల్లీ మేరి అన్నారు

చేతి రాత బాగుండాలి...

సరళమైన ఆకట్టుకునే చేతిరాతతో ఎగ్జామినర్ లను ఆకట్టుకోవచ్చు. చేతిరాత కనీసం చదివేందుకు వీలుగా ఉండాలి. ప్రశ్నలకు సంబంధించిన జవాబులను సరైన హెడ్డింగ్స్, సబ్ హెడ్డింగ్స్ పెట్టి పాయింట్ వైజ్ గా రాయాలి. ప్రధానాంశాలను అండర్లైన్ చేయాలి. కాగితంపై ఒత్తిపెట్టి రాయవద్దు. పరీక్ష రోజే కొత్త పెన్ను వాడవద్దు. రెండు రోజుల ముందుగానే ఆ పెన్నుతో రాస్తూ అలవాటు చేసుకోవాలని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

తల్లిదండ్రులకు సూచన...

సామాజిక హోదాకు మీ పిల్లల విజయాలను కొలమానం చేయవద్దు. ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది దానిని గుర్తించండి.మార్కులే జీవితము కాదు. దాని కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురాకండి. ఇతరుల పిల్లలతో మీ వాడికి పోలికలు తీసుకురావద్దు అని కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లిల్లీ మేరి తన అభిప్రాయాలను వెలిబుచ్చారు

### నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘనంగా

# స్వయం పాలన దినోత్సవం...



నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 12 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినపల్లి మండలం వెల్గొండ గ్రామంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల బాధ్యతలను స్వీకరించి పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం అయ్యారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇద్రిస్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్వయం పాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెరుగుతాయని అధికారులు తెలిపారు.

## పాలెం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు...




నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 12 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల పరిధిలో గల పాలెం గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఎద్దులు మరియు ఇతర పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య శాఖ సిబ్బంది వేయడం జరిగింది.పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు భవిష్యత్తులో గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ టీకాలను అందిస్తున్నట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. పశుసంపద రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారం కావడంతో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ పాల్గొని రైతులకు పశువుల సంరక్షణ, పరిశుభ్రత, సమయానికి టీకాలు వేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పశువైద్య సిబ్బంది అల్లస్వామి, రాము, శివ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు సుదర్శన్ రెడ్డి, ఎం.డి. జాంగీర్, శంకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు. పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత టీకాల కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సిబ్బంది సూచించారు.

### నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన

# ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు.



మంథని//**మార్చి 12 (ఆకాంక్ష) :**పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గుమ్మనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ చెరుకు తోట సురేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి మంత్రి రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రజలకు అంకితం చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేయాలని, ప్రజల అవసరాలను గుర్తించి పనిచేస్తే గ్రామ ప్రజలు సంతోషంగా ఉంటారని ఆయన తెలిపారు. మంథని నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధికి తాను ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని మంత్రి స్పష్టం చేశారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు అందించేందుకు తాను కృషి చేస్తానని ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ ప్రతినిధులు కట్టుబడి పనిచేయాలని మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సెగ్గం రాజేశం, ఒడెలు కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలి...

## ఎంఈవో రఘునందన్ శర్మ...



నాగర్ కర్నూల్ టౌన్//**మార్చి 12 (ఆకాంక్ష) :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక వారాంత శిబిరం గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొని సేవాభావంతో ముందుకు రావాలని సూచించారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ పి. జ్యోతి శంకర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యార్థులు గ్రామంలో చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమాలు, చెరువు కట్ట వద్ద కంప చెట్ల తొలగింపు,దేవాలయాల పరిసరాల శుభ్రత వంటి కార్యక్రమాలు గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా మారాయని తెలిపారు. అలాగే డ్రగ్స్ నివారణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించినందుకు విద్యార్థులను అభినందించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. సుష్మ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెంపొందుతుందని తెలిపారు. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డా. నాగరాజు, శివ దొడ్లతో పాటు అధ్యాపకులను అభినందించారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్స్ వినతి పత్రం...



మంథనిరూరల్/**మార్చి 12 (ఆకాంక్ష) :** మంథని నియోజకవర్గంలోని ఆశా వర్కర్స్ తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ తమ డిమాండ్లను పిఏ ద్వారా మంత్రి కార్యాలయానికి అందజేశారు.వినతి పత్రంలో ఆశా వర్కర్స్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వారికి రూ.18,000/- ఫిక్స్ వేతనం నిర్ణయించాల్సిన అంశాన్ని, ఇతర సమస్యల పరిష్కారానికి చీఎవీ కు తగిన నిధులు కేటాయించాలని, జనవరి, ఫిబ్రవరి నెలల పారితోషికాలను వెంటనే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1,500/- వేతనాన్ని అమలు చేయాలని మరియు 2021 జూలై నుండి డిసెంబర్ వరకు ౹ా=జ ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి. జ్యోతి, జిల్లా నాయకులు బూడిద గణేష్, వి. అమృత, బి. రమాదేవి, శ్రీలత రాజేశ్వరి, లావణ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఆశా వర్కర్స్ వారి డిమాండ్లను ప్రభుత్వం సమగ్రమైన విధంగా పరిశీలించి, ఆరోగ్య సేవల మెరుగుదలకు తక్షణమే అమలు చేయాలని ఈ కార్యక్రమంలో ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# అవినీతిపై విచారణ పూర్తయ్యేంతవరకు బిల్లులను నిలిపి వేయాలి...

## భారత కమ్యూనిస్టు పార్టీ 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య...



గోదావరిఖని//**మార్చి 12 (ఆకాంక్ష) :** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ట్రాన్స్ఫర్ డ్యూటీ ఫండ్స్ కు సంబంధించిన 13 కోట్ల 70 లక్షల రూపాయల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులలో అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లడి అయ్యాయని భారత కమ్యూనిస్టు పార్టీ 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీకు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో మార్కపురి సూర్య మాట్లాడుతూ...రామగుండం కార్పొరేషన్‌లో 13 కోట్ల 70 లక్షల రూపాయల పనులను ఏడు ప్యాకేజీలుగా పిలవడం జరిగింది. కాంట్రాక్టర్లు, అధికారులు మధ్య సిండికేట్ ద్వారా 0.5% నుండి 1.5% లెస్ శాతంతో పనులు కేటాయించబడ్డాయి. దీనివల్ల భారీ అవినీతి చోటు చేసుకుంది," అని పేర్కొన్నారు.అవినీతికి కారణంగా, కాంట్రాక్టర్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రమాణాలు ఉల్లంఘిస్తూ నిర్మించారు. "ఆర్సీసీ పైపులు, యూజీడీలు (ఖ+ణ) నాణ్యత ప్రమాణాలను పాటించకుండా వాడి పనులు పూర్తిచేశారు. వర్క్ ఆర్డర్ ప్రకారం నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సి ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు ప్రమాణాలను అనుసరించలేదని," సూర్య తెలిపారు.వీటితో పాటు, సి.డి.ఎం.ఏ నిబంధనల ప్రకారం ట్రాన్స్ఫర్ డ్యూటీ ఫండ్స్ ను కేవలం కార్మికుల జీతాల, అత్యవసర మున్సిపల్ వ్యవహారాలకే ఉపయోగించాలి. కానీ ఉన్నతాధికారులు ఈ ఫండ్స్‌ను కాంట్రాక్టర్లకు అత్యల్ప లెస్ శాతంతో కేటాయించడం, కమిషన్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారి లు దానిలో భాగం కావడం ద్వారా కార్పొరేషన్ ఆదాయం నష్టం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు.మార్కపురి సూర్య విజిలెన్స్ విచారణ పూర్తయ్యే వరకు బిల్లులను చెల్లించరాదు, కాంట్రాక్టర్లు మరియు పాలపొందిన అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు. ఒకవేళ బిల్లులు చెల్లిస్తే, శాఖాపరమైన, న్యాయ పరమైన చర్యలు తప్పక జరుగుతాయని హెచ్చరించారు.వినతి పత్రంలో, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ విభాగంతో పరిశీలించాల్సి ఉన్నదని, పూర్తి అవినీతి విచారణ తర్వాత మాత్రమే బిల్లులు చెల్లించాలన్న దిశగా సూచించారు. మార్కపురి సూర్య పేర్కొన్నారు, ఈ విధమైన చర్యలు రామగుండం కార్పొరేషన్‌లో పారదర్శకత, నాణ్యత, సత్యనిష్ఠ వ్యవహారాలను నెలకొల్పడంలో కీలకంగా ఉంటాయని.క్రమంగా విచారణ జరగడం ద్వారా అవినీతికి పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్లు పై చర్యలు తీసుకోవడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను నివారించడం ముఖ్య లక్ష్యంగా మారుతోంది. ప్రజా దృష్టిని రామగుండం కార్పొరేషన్‌లోని ఫండ్స్ వినియోగంపై కేంద్రీకరించడం, అవినీతి ఘటనలకు పూర్తి స్థాయి ప్రతిఘటన కల్పించడం ఈ వినతిపత్రం లక్ష్యంగా ఉందని పార్టీ అధికారులు తెలిపారు.రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ట్రాన్స్ఫర్ డ్యూటీ ఫండ్స్ కు సంబంధించిన అవినీతి విచారణకు సంబంధించి అధికారులు, కమిషనర్ అరుణశ్రీ ద్వారా అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని, బిల్లులను ఫలితంగా వాయిదా పెట్టి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ, విజిలెన్స్ విచారణ పూర్తి చేయాలని ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్ నిర్మించుకోవాలి...

ఈగల్ ఫోర్స్ సీఐ హేమ రాణి...



భద్రాద్రి కొత్తగూడెం//మార్చి 12 (ఆకాంక్ష) : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు యువత జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని, వాటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఈగల్ ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హేమ రాణి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో గురువారం పోలీస్ శాఖ, ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు' నిర్వహించారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి సీఐ హేమ రాణి మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు మానవ జీవితాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనాలని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల గుండెపోటు, క్యాన్సర్, కాలేయం, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అదేవిధంగా మత్తు పదార్థాలు మెదడు పనితీరును దెబ్బతీసి ఆలోచనా సామర్థ్యాన్ని తగ్గిస్తాయని చెప్పారు. మత్తుకు బానిసలైన వారిలో తీవ్ర ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు పెరిగి ఆత్మహత్య ధోరణులు కూడా అధికమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యసనాలకు లోనైన వ్యక్తి మాత్రమే కాకుండా అతని కుటుంబం కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆర్థికంగా, సామాజికంగా, చట్టపరంగా అనేక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకోవాలని ఒత్తిడి చేసినా ధైర్యంగా 'నో' చెప్పే ధైర్యం ప్రతి విద్యార్థిలో ఉండాలని సీఐ సూచించారు. అమూల్యమైన మానవ జీవితాన్ని మత్తు పదార్థాల వల్ల పాడు చేసుకోవద్దని పేర్కొంటూ విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం చంద్రుగొండ క్రాస్ రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ విద్యార్థులు, అధికారులు కలిసి మానవహారం ఏర్పడి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి, విద్యాశాఖ అధికారి బానోత్ జూంకిలాల్, పీహెచ్‌సీ వైద్యులు బానోత్ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, నేతాజీ, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థినికి ప్రతిభ....




నల్గొండ//మార్చి 12 (ఆకాంక్ష) : నల్గొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థిని సోమ శివాన్సిక జాతీయ స్థాయి మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తీసుకొచ్చింది. ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సెకండ్ లెవెల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో శివాన్సిక ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐబీఆర్ ఫౌండర్ రామకృష్ణ, మిస్ ఇండియన్ సుహాసిని, చైల్డ్ సైకాలజిస్ట్ సిరి పూజ, నేషనల్ రైఫిల్స్ షూటర్ డాక్టర్ భువనేశ్వరి చేతుల మీదుగా శివాన్సిక ప్రశంస పత్రం మరియు మెమెంటో అందుకుంది. కార్యక్రమంలో ఆమె ప్రతిభను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ఎస్పీఆర్ పాఠశాల యాజమాన్యాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్ కంభంపాటి శ్రీనయ్యకు ఉత్తమ టీచర్ అవార్డు అందజేసి సన్మానించారు. విద్యార్థిని శివాన్సికను పాఠశాల డైరెక్టర్లు జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, నాదెండ్ల అయ్యన్న, కంభంపాటి శ్రీనయ్య, ప్రిన్సిపాల్ స్వయంపాకల హరితతో పాటు ఉపాధ్యాయులు సునీత, షాయిని, శ్రీలక్ష్మి, వనజ, అంజలి, డేవిడ్, సోనీ తేజశ్రీ, రమ్యలత, జానీ బేగం అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ నేత ఆకుల శ్రీనివాస్‌పై కాంగ్రెస్ నేతల దాడి...

కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు

కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు...



మెదక్/మార్చి 12 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలో రాజకీయ ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపాడనే కారణంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కొంతాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ భర్త ఆకుల శ్రీనివాస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారన్న ఆరోపణలు గ్రామంలో కలకలం రేపాయి. బాధితుడు ఆకుల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, తాను తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా కాంగ్రెస్‌కు చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, టేకులపల్లి రవీందర్ రెడ్డి, కలకంటి వెంకటేష్ ముగ్గురు కలిసి కారులో అక్కడికి వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా వారు తనతో దురుసుగా ప్రవర్తించి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. తాను అంగీకరించకపోవడంతో ఒక్కసారిగా తనపై దాడి చేశారని చెప్పారు. దాడి సమయంలో తన మెడలో ఉన్న తువాలును గట్టిగా మెడకు చుట్టి కొట్టారని, అలాగే తన కారును కూడా తీసుకెళ్లారని శ్రీనివాస్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపిన కారణంతోనే తనపై ఈ దాడి జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆకుల శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేశారు. అనంతరం తన అనుచరులతో కలిసి విలేకరులతో మాట్లాడిన ఆయన అధికార పార్టీ నాయకులు తమ ప్రభావాన్ని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన పార్టీకి మద్దతు తెలిపే హక్కు ఉందని, ఆ హక్కును అణగదొక్కే ప్రయత్నాలు చేయడం సరైంది కాదని అన్నారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను పోలీసులు కఠినంగా అరికట్టాలని, దాడి చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు శివ్వంపేట ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

## ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి...



సూర్యాపేట//మార్చి 12 (ఆకాంక్ష) : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో ఆశా కార్యకర్తలు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. గురువారం తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోలో ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా ఇప్పటివరకు ఆ హామీలను అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలు అందిస్తున్నప్పటికీ తగిన గుర్తింపు, సరైన వేతనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వెంటనే తమకు ఇచ్చిన హామీలను అమలు చేసి వేతనాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మేకాక జయమ్మ, రాజేశ్వరి, సుజాత, యాకలక్ష్మి, వెంకట లక్ష్మి, నిలమ్మ, శోభ, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీ బెదిరింపులతోనే సతీష్ ఆత్మహత్య చేసుకున్నాడు...

భవిష్యత్తులో పోలీస్ స్టేషన్ల ముందు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల బోర్డులు పెట్టాల్సి వస్తుంది...

రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్న పోలీసుల పేర్లను పింక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం...

సతీష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం...

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర ఆరోపణలు...





మంథని//మార్చి 12 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా మంథనిలో స్థానిక పోచమ్మ వాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పెరుగు సతీష్ ఆత్మహత్య ఘటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సతీష్ ఆత్మహత్యకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్‌లే కారణమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం మంథని ప్రభుత్వ ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉన్న సతీష్ మృతదేహాన్ని ఆయన సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్ట మధూకర్ మాట్లాడారు. పెరుగు సతీష్ సుమారు 25 రోజుల క్రితం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పిలిపించి వేధింపులకు గురిచేసిన కారణంగానే తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించాడని ఆయన తెలిపారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చివరకు మృతి చెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఎవరైతే తనను ఒక అమ్మాయి ఇబ్బంది పెడుతోందని చెప్పిందో ఆ అమ్మాయి లేకుండానే ఏసీపీ ఏకపక్షంగా సతీష్‌పై ఒత్తిడి తీసుకువచ్చాడని సతీష్ సోదరి చెప్పినట్లు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉదయం తీసుకువచ్చిన కూడా ఉదయం తొమ్మిది గంటల వరకు ఎస్సై అక్కడికి రాకపోవడం, బాధిత కుటుంబ సభ్యుల నుండి దరఖాస్తు స్వీకరించకపోవడం బాధాకరమని పుట్ట మధూకర్ విమర్శించారు. రామగుండం పోలీసులు తమకు నచ్చిన విధంగా దరఖాస్తు రాసి ఇవ్వాలని హుకూం జారీ చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం పోలీసులను అనేకసార్లు హెచ్చరించామని, పోలీసులు తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలి తప్ప రాజకీయాల్లో జోక్యం చేసుకోకూడదని సూచించారు. ఇదే విధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో పోలీస్ స్టేషన్ల ముందు కాంగ్రెస్ కార్యాలయాల బోర్డులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అమాయకుల ప్రాణాలకు కారణమవుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ ఎక్కడ ఉన్నా వారిపై చర్యలు తప్పవని పేర్కొంటూ వారి పేర్లను పింక్ బుక్‌లో నమోదు చేసి ఉంచామని చెప్పారు. నియోజక వర్గంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన కుటుంబ సభ్యులు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. సొంత పార్టీ కార్యకర్తకు సమస్య ఎదురైతే మంత్రి స్వయంగా ముందుకు వచ్చి పరిష్కరించాల్సింది పోయి పోలీసుల ద్వారా ఒత్తిడి తీసుకురావడం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తలంటే మంత్రి శ్రీధర్‌బాబుకు గౌరవం లేదనే విషయానికి సతీష్ ఘటన ఉదాహరణగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. తాను బీసీ కుటుంబంలో పుట్టి పెరిగిన వ్యక్తినని, ఈ సమాజం సమస్యలు తెలుసుకుని పోరాటం చేస్తున్నానని పుట్ట మధూకర్ తెలిపారు. తాను పదవుల కోసం లేదా ఓట్ల కోసం రాజకీయాలు చేయడం లేదని, బీసీ సమాజాన్ని ఓట్ల కోసం ఉపయోగించుకునే రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. ఇటీవల సూరారం గ్రామంలో రామకృష్ణ అనే వ్యక్తి మరణించిన ఘటనలో కూడా అక్కడి డీఎస్పీ అవహేళనగా మాట్లాడినట్లు ఆయన ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా 30 సంవత్సరాల అనుభవం ఉన్న తాను మాట్లాడినా కూడా ఆ అధికారి స్పందించిన తీరు బాధాకరమని అన్నారు. పోలీస్ వ్యవస్థ ఈ స్థాయికి దిగజారడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అమాయకులు రాజకీయ కుట్రలు, పోలీసు అరాచకాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని పుట్ట మధూకర్ అన్నారు. సతీష్ మరణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబం మరియు పోలీసు యంత్రాంగమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన ఆరోపించారు. తక్షణమే పోలీసులు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదును స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా వెంటనే స్పందించి ఈ ఘటనపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. సతీష్ మృతి చెందక ముందే మానవ హక్కుల కమిషన్‌లో కేసు పెట్టినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మంథని పోలీసులు వెంటనే ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు ప్రారంభించాలని అన్నారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. సతీష్ కుటుంబానికి తాము అండగా నిలుస్తామని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మంథని లక్ష్మణ్, పుప్పాల తిరుపతి, సాగర్, పిల్లి సత్తన్న, కనకరాజులతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లో దారుణం...

ప్రేమ పేరుతో మైనర్ బాలికల మోసం..

ఒకరికి గర్భం రహస్యంగా అబార్షన్...

మొబైల్‌లో అభ్యంతరకర ఫోటోలు, వీడియోలు...



నాగర్‌కర్నూల్//మార్చి 12 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో మైనర్ బాలికలను మోసం చేస్తూ వారిని లొంగదీసుకున్న ఓ ఇంటర్ విద్యార్థి దారుణాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో ఒక బాలిక గర్భం దాల్చడంతో రహస్యంగా అబార్షన్ చేయించగా విషయం బయటపడింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన ఓ ఇంటర్ విద్యార్థి పలువురు మైనర్ బాలికలను ప్రేమ పేరుతో మోసం చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. స్నేహం పేరుతో వారిని దగ్గరయ్యి, ప్రేమిస్తున్నానని నమ్మబలికి వారి నమ్మకాన్ని దుర్వినియోగం చేశాడు. ఈ క్రమంలో కొంతకాలంగా పలువురు బాలికలతో అనుచిత సంబంధాలు కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఇలా మోసపోయిన బాలికల్లో ఒకరు గర్భం దాల్చినట్లు తెలిసింది. విషయం బయటపడకుండా ఉండేందుకు ఆ బాలికను కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి రహస్యంగా అబార్షన్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం బాలిక ఆరోగ్యం క్షీణించడంతో విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇంటర్ విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా అతని మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా పలువురు బాలికలతో అనుచితంగా తీసిన ఫొటోలు, వీడియోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ ఘటన మరింత సంచలనంగా మారింది. ఇక ఈ ఘటనలో కొల్లాపూర్‌లోని సాయి కృప ఆస్పత్రి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైనర్ బాలికకు చట్టవిరుద్ధంగా అబార్షన్ నిర్వహించారని ఆరోపణలు రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి నిర్వహణపై అధికారులు దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. ఈ ఘటనపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో మరికొందరి పాత్ర కూడా ఉండే అవకాశముందని భావిస్తూ సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారు. జిల్లాలో ఈ ఘటన సంచలనం రేపింది.

## రెండో పెళ్లి కోసం భార్యపై భర్త దాడి

మేనకోడలిని రెండో పెళ్లి చేసుకోవాలని పట్టుదల



కాకినాడ//మార్చి 12 (ఆకాంక్ష) : కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో భర్త చేతిలో భార్య దారుణంగా దాడికి గురైన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనాన్ని రేపింది. రెండో పెళ్లి చేసుకునేందుకు భార్య అంగీకరించలేదనే కారణంతో ఓ భర్త ఆమెను రోడ్డుపై పడేసి దారుణంగా కొట్టిన ఘటన వెలుగుచూసింది. ఈ ఘటన సామర్లకోట మండలం పీవేమవరం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మణికంఠ అనే యువకుడు దేవి అనే యువతిని 2021 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలం పాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. దేవి ప్రభుత్వ ఉద్యోగిగా ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని చూసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే కొంతకాలంగా మణికంఠ తన మేనకోడలును రెండో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని దేవికి చెప్పడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదాలు ప్రారంభమయ్యాయి. రెండో పెళ్లికి తాను ఒప్పుకోనని దేవి స్పష్టంగా చెప్పడంతో వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల కూడా ఇదే విషయమై భార్యాభర్తల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర ఘర్షణకు దారితీసింది. కోపోద్రిక్తుడైన మణికంఠ తన భార్య దేవిని రోడ్డుపైకి లాగి కింద పడేసి దారుణంగా కొట్టినట్లు తెలుస్తోంది. స్థానికుల ముందే ఈ ఘటన జరగడంతో అక్కడ ఉన్న వారు షాక్‌కు గురయ్యారు.



మణికంఠ చేతిలో తీవ్రంగా గాయపడిన దేవి వెంటనే తనకు న్యాయం చేయాలని నిర్ణయించుకుంది. అనంతరం ఆమె సర్పవరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భర్తపై ఫిర్యాదు చేసింది. భర్త తనను తరచూ వేధిస్తున్నాడని, రెండో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. దేవి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఇటీవల కుటుంబ వివాదాలు, రెండో పెళ్లి అంశాలపై జరిగే ఘర్షణలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరంగా మారుతున్నాయని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. పోలీసులు కేసును అన్ని కోణాల్లో విచారిస్తూ తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు...



మెదక్//మార్చి 12 (ఆకాంక్ష) : మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని నాగసన్‌పల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి విజయ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడటంతో పాటు సరైన ప్రణాళికతో, ఆసక్తితో చదివితేనే మంచి ఫలితాలు సాధించగలరని ఆమె తెలిపారు. ఈసారి పరీక్షల మధ్య విరామం ఎక్కువగా ఉండటంతో ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో పాఠాలను పునర్విమర్శ చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల సమయంలో అవసరం లేని కార్యక్రమాలకు దూరంగా ఉండి తప్పనిసరిగా పాఠశాలకు హాజరవుతూ రెవిజన్‌పై దృష్టి పెట్టాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండెం సుశీల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రమ్మ, స్థానిక ప్రధానోపాధ్యాయులు నజీరుద్దీన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, నవీన్ కుమార్ (ఎస్‌వో), రాజు (సీఎంఓ), రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రాంకిషన్, మహిపాల్ రెడ్డి, వట్టం సంగమేశ్వర్, సాయి కృష్ణ, నాయకులు దుర్గేష్, జగదీశ్వర్, విజయ (వీవో), ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్ కుమార్, నర్సిములు, సిద్ధేశ్వర్, రేఖా, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం...

ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి...



నాగర్‌కర్నూల్ టౌన్//మార్చి 12 (ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో గల బస్తీ దవాఖానలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్యక్రమంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డా. కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. బస్తీ దవాఖానాల ద్వారా పేదలకు దగ్గర్లోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు, స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా దవాఖాన పరిసరాల్లో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు సునీత, శ్రీనివాస్ గౌడ్, చంద్రకళ, శ్రీనివాసులు, అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## లింగాపూర్‌లో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహణ...




గోదావరిఖని//మార్చి 12 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా-1 పరిధిలోని ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా లింగాపూర్ గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్జీ.1 జీఎం డి. లలిత్ కుమార్ సూచన మేరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని ఆర్జీ.1 ఎస్.ఓ.టు జీఎం కె. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ సింగరేణి సంస్థకు ప్రధాన ధ్యేయమని తెలిపారు. సంస్థ ఉద్యోగులతో పాటు ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో గ్రామస్థులకు సీజనల్ వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. జ్వరం, జలుబు, రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి మొత్తం 103 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేశారు. వేసవి కాలం దృష్ట్యా ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజని రవి, డాక్టర్ కారం పద్మ, డాక్టర్ ఆదినారాయణ, మేడిపల్లి గ్రూప్ ఏజెంట్ ఎల్. రమేష్, డీజీఎం సివిల్ వరప్రసాద్, మేడిపల్లి ఓసీపీ మేనేజర్ మల్లిఖార్జున్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో గ్రామస్థులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు.

# నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం...



నాగర్‌కర్నూల్ టౌన్ //**మార్చి 12 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల పరిధిలోని నాగదేవపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు ప్రభుత్వం గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోందని తెలిపారు. నూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చనిపోయిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక చేయూత...



గోదావరిఖనిటౌన్ //**మార్చి 12 (ఆకాంక్ష) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఆరోగ్య సమస్యలతో మరణించిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ సంక్షేమ నిధి నుంచి ఒక్కొక్కరి కుటుంబానికి రూ.15,000 చొప్పున మంజూరైన చెక్కులను గురువారం అందించారు. మరణించిన హోంగార్డులు డి. తిరుపతి (హోంగార్డ్ నం. 801), ఎం. రాములు (హోంగార్డ్ నం. 272) కుటుంబ సభ్యులకు ఈ చెక్కులను రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న హోంగార్డులు పోలీస్ శాఖకు ఎంతో సేవలందిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డ్స్ ఆర్ఐ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది సందర్భంగా పోచమ్మ బోనాల జాతర నిర్వహణ...

గోదావరిఖని//**మార్చి 12 (ఆకాంక్ష) :** ఉగాది పండుగను పురస్కరించుకొని ఈ నెల 19న పోచమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆది జాంబవ అరుంధతి సేవా సమితి, పోచమ్మ బోనాల జాతర కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు కోటగిరి పాపయ్య, దాసరి ఎల్లయ్య మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఉగాది పర్వదినం సందర్భంగా మాదిగ కులస్తుల కులదైవమైన పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతున్నదని తెలిపారు. అయితే ఈ సంవత్సరం నుండి మాదిగల ఐక్యతను చాటే విధంగా ఒకే రోజున భారీ స్థాయిలో పోచమ్మ బోనాల జాతర నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ బోనాల జాతరలో మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, ఇటీవల గెలుపొందిన మాదిగ కార్పొరేటర్లు కూడా పాల్గొననున్నట్లు వెల్లడించారు. దాదాపు పది వేల బోనాలతో మాదిగ మహిళలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 19న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో బోనాలతో తరలివచ్చి కులదైవమైన పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి తమ ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఆది జాంబవ అరుంధతి సేవా సమితి, పోచమ్మ బోనాల జాతర కమిటీ సభ్యులు కందుకూరి రాజారత్నం, కనుకుంట్ల రమేష్, మంద రవికుమార్, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గంగదేవిపల్లి సందర్శనకు గూడెం గ్రామ పాలకవర్గం పయనం...




ఓదెల//**మార్చి 12 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గూడెం గ్రామ పాలకవర్గం ఆదర్శ గ్రామ అభివృద్ధి విధానాలను తెలుసుకునేందుకు వరంగల్ జిల్లా గంగదేవిపల్లి గ్రామానికి పర్యటనకు బయలుదేరింది. గూడెం గ్రామ సర్పంచ్ చిట్ల రామ్ ఆధ్వర్యంలో ఈ పర్యటన చేపట్టినట్లు గ్రామ నాయకులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఆదర్శ గ్రామంగా పేరుపొందిన గంగదేవిపల్లి గ్రామ అభివృద్ధి నమూనాను పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న పథకాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేయడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని సర్పంచ్ తెలిపారు. ఒక సాధారణ గ్రామం సమగ్ర అభివృద్ధితో ఎలా ఆదర్శ గ్రామంగా మారిందో ప్రత్యక్షంగా తెలుసుకుని, అక్కడి మంచి పద్ధతులను గూడెం గ్రామంలో అమలు చేయాలని గ్రామ పాలకవర్గం భావిస్తున్నట్లు చెప్పారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే కాకుండా, నిర్మల్ పురస్కార్ అవార్డు సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఉపసర్పంచ్ బుడిగె కుమారస్వామి, వార్డు సభ్యులు తిప్పారపు అభిలాష్, కర్ర శ్రీధర్, బుడిగె లక్ష్మణ్, వీరముష్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 14 నుంచి పదో తరగతి

# పబ్లిక్ పరీక్షలు ప్రారంభం...



హైదరాబాద్//**మార్చి 12 (ఆకాంక్ష) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీ వరకు కొనసాగనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల సమయం ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని అధికారులు వెల్లడించారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఇప్పటికే ముమ్మరంగా సిద్ధమవుతున్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. మీ సేవ కేంద్రాల ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించడంతో పాటు 8096958096 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా హాల్‌టికెట్లు పొందే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. ఈసారి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల్లో 5,17,727 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రంలోని 5,329 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది, 1,057 గురుకుల పాఠశాలల నుంచి 60,139 మంది, 5,288 ప్రైవేట్ మరియు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 2,50,015 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సులభంగా చేరుకునే విధంగా హాల్‌టికెట్లపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ముద్రించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ ద్వారా ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రానికి వెళ్లే రూట్ మ్యాప్ ఆటోమేటిక్‌గా తెరుచుకునేలా ఏర్పాట్లు చేశారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలకమైనవని, భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా సూచించారు. అలాగే పాఠ్యాంశాలను సరిగా చదివి, అర్థం చేసుకుని రాస్తే అవి ఎక్కువకాలం గుర్తుండి మంచి ఫలితాలు సాధించవచ్చని పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ఈసారి సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నాపత్రాలను తెరవాలని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు.

# మార్చి 18న శ్రీరాంపూర్ ఏరియా నుంచి “సేవ్ సింగరేణి జీవు జాత” ప్రారంభం...

## సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది...

## ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్...




గోదావరిఖని//**మార్చి 12 (ఆకాంక్ష) :** సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో సంస్థపై భారీ ఆర్థిక భారం పడిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తీవ్రంగా విమర్శించారు. సింగరేణికి రావాల్సిన సుమారు రూ.51 వేల కోట్ల బకాయిలను పదమూడు సంవత్సరాలుగా చెల్లించకుండా వదిలేసి సంస్థను ఆర్థికంగా బలహీన పరుస్తున్నారని ఆయన ఆరోపించారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండేళ్లు గడిచినా కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆయన అన్నారు. స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో కొన్ని సమస్యలను యాజమాన్యం అంగీకరించినప్పటికీ వాటి అమలుకు ఇప్పటివరకు సర్క్యులర్లు జారీ చేయలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా మారుపేర్లతో నమోదు చేసిన విజిలెన్స్ కేసులు, సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్య, డిస్మిస్ చేసిన కార్మికులకు మరో అవకాశం కల్పించడం వంటి అంశాలను పరిష్కరించాలని పలుమార్లు కోరినా స్పందన లేదని అన్నారు. ఈసమస్యలపై ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగిస్తుండటంతో ఈ నెల 17 నుండి 30 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కొరిమి రాజ్‌కుమార్ ప్రకటించారు. మార్చి 17న సింగరేణి పరిధిలోని అన్ని గనుల వద్ద ధర్నాలు, నిరసనలు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మార్చి 18న మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా నుంచి “సేవ్ సింగరేణి జీవు జాత” ప్రారంభమై అన్ని ఏరియాల్లో కార్మికులను చైతన్యపరుస్తూ సాగుతుందని తెలిపారు. మార్చి 30న కొత్తగూడెం హెడ్ఆఫీస్ ముందు భారీ ధర్నా, సభ నిర్వహించనున్నామని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గౌతం గోవర్ధన్, ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, ఆకునూరి శంకరయ్య, దాసరి శ్రీనివాస్, మిట్టపల్లి మొగిళి, దోరగండ్ల మల్లయ్య, ఏ.వి.ఎస్.ప్రకాశ్, వినయ్‌కుమార్, దేవేందర్ రెడ్డి, ఏ.రవికుమార్, పడాల కనకరాజు, గంగారపు చంద్రయ్య, చెప్యాల మహేందర్ రావు, ఎజ్జ రాజయ్య, కలవల జగన్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తడి చెత్తను ఎరువుగా మార్చేందుకు ప్రజలు సహకరించాలి...

## రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి...






గోదావరిఖనిటౌన్//**మార్చి 12 (ఆకాంక్ష) :** తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చే ప్రక్రియలో ప్రజలు భాగస్వాములవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం గోదావరిఖని శివాజీ నగర్ కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను ప్రత్యేక డబ్బాల్లో నిల్వ చేసి మున్సిపల్ పారిశుద్ధ్య వాహనాలకు అందించాలని ఆయన సూచించారు. గౌతమినగర్‌లో ఉన్న కంపోస్ట్ యార్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పండ్లు, కూరగాయల వ్యర్థాలను కంపోస్ట్ మరియు బయోగ్యాస్‌గా మార్చే రీసైక్లింగ్ ప్రక్రియను త్వరలోనే మార్కెట్ వద్దే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి షాపులో తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించే విధంగా డబ్బాలు ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులతో కరచాలనం చేస్తూ “స్వచ్ఛ మార్కెట్ స్వచ్ఛ నగరం” లక్ష్యాన్ని సాధించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ సమీపంలోని పెద్ద కాలువను పరిశీలించి శుభ్రతపై అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం మనో చైతన్య మానసిక వికలాంగుల కేంద్రం వద్ద నిర్వహించిన ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌లో మేయర్ పాల్గొన్నారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు భాగస్వాములవుతూ సేవలందించడం అభినందనీయమని తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. తరువాత నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణను పరిశీలించి పరిసరాలను పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. వేర్వేరు కార్యక్రమాల్లో నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు తిప్పారపు మానస, కల్వల పద్మావతి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్ రావు, సీడీపీవో అలేఖ్య, ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్వైజర్ జమున తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నగరాభివృద్ధికి సహకరించాలని మేయర్ మహంకాళి స్వామి కోరారు. గురువారం ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ నగర పాలక సంస్థకు సిఎస్ఆర్ నిధుల కింద 550 ఎల్ఈడి వీధి దీపాలను అందజేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంస్థ సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు మాట్లాడుతూ గతంలో సమర్పించిన ప్రతిపాదనల మేరకు 70 వాట్ల లైట్లు 250, 45 వాట్ల లైట్లు 300 అందజేస్తున్నామని, మరో 15 రోజుల్లో అదనంగా 70 లైట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామికి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. నగరంలో వీధి వెలుగులను మెరుగుపరచేందుకు మరో వెయ్యి వీధి దీపాల మెటీరియల్ అందించాలని మేయర్ ప్రతిపాదనలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ యూనిట్ హెడ్ బాలసుబ్రహ్మణ్యం, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ సురేంద్రబాబు, డీజీఎం హెచ్ఆర్ సోమనాథ్, సీనియర్ మేనేజర్ వెంకట్ రెడ్డి, నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, ఏసీపీ శ్రీహరి, ఏఈ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో ఫేక్ డాక్టర్ కలకలం...

## యశోద ఆస్పత్రిలో రోగి బంగారం అపహరణ...



హైదరాబాద్//**మార్చి 12 (ఆకాంక్ష) :** సికింద్రాబాద్‌లోని ప్రముఖ యశోద హాస్పిటల్స్ లో ఫేక్ డాక్టర్ కలకలం రేపింది. వైట్ కోట్ వేసుకుని డాక్టర్‌లా నటించిన ఓ మహిళ రోగిని మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఆమె ఒంటిపై ఉన్న 10 తులాల బంగారం అపహరించి పరారైంది. ఈ ఘటన ఆస్పత్రి వర్గాల్లో ఆందోళనకు గురిచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఓల్డ్ బౌన్ పల్లి కు చెందిన సుధారాణి అనారోగ్యంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గురువారం ఆమె డిశ్చార్జ్ కావాల్సి ఉండగా, వైట్ కోట్ ధరించి డాక్టర్‌లా నటించిన ఓ మహిళ చికిత్స పేరుతో పేషెంట్ గదిలోకి వెళ్లింది. రోగికి చికిత్స చేయాల్సి ఉందని చెప్పి బంధువులను బయటకు పంపించింది. అనంతరం సుధారాణికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి, ఆమె ఒంటిపై ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలను అపహరించింది. ఆ తర్వాత ఎవరికి తెలియకుండా అక్కడి నుంచి పరారైంది. కొంతసేపటి తరువాత రోగి బంధువులు గదిలోకి వెళ్లి చూడగా ఆమె ఒంటిపై ఉన్న బంగారం కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రి యాజమాన్యాన్ని సంప్రదించగా, ఆ మహిళ తమ ఆస్పత్రికి చెందిన డాక్టర్ కాదని తెలియజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నర్సింగ్ స్టాఫ్ గది సమీపంలోని సీసీ కెమెరాల్లో నకిలీ డాక్టర్ కదలికలు రికార్డు అయినట్లు తెలుస్తోంది. ఆమె ఆస్పత్రికి పరిచయం ఉన్న వ్యక్తేనా? లేక బయట వ్యక్తినా? అన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో ఆస్పత్రిలో భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోగుల భద్రత కోసం ఆస్పత్రి యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

## యుద్ధం ఆగాలంటే ఇరాన్

# 3 షరతులు విధించిన ఇరాన్ అధ్యక్షుడు...



టెహ్రాన్ **మార్చి 12 (ఆకాంక్ష) :** అమెరికా-ఇజ్రాయెల్ దళాలతో జరుగుతున్న యుద్ధం ఆగాలంటే ఇరాన్ కొన్ని షరతులు విధించింది. ఇరాన్ అధ్యక్షుడు మసోద్ పెజెష్కియాన్ దీని గురించి తన సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశారు. అమెరికా కూటమితో ఎటువంటి ఒప్పందం జరిగినా.. ఇరాన్ సహజ హక్కులను గుర్తించాలని పెజెష్కియాన్ అన్నారు. రష్యా, పాకిస్థాన్ నేతలతో ఈ అంశం గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపన జరగాలంటే కొన్ని అంశాలు కీలకమైనవని ఆయన అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దళాలతో యుద్ధం ముగియాలంటే మూడు అంశాలు ముఖ్యమైనవని పెజెష్కియాన్ తెలిపారు. ఇరాన్ హక్కుల్ని గుర్తించడం, నష్టపరిహారాన్ని చెల్లించడంతో పాటు భవిష్యత్తులో ఎటువంటి దాడులు చేయబోమనన్న గ్యారెంటీ ఇవ్వాలని ఇరాన్ అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై ఆకస్మికంగా జరిపిన దాడిలో.. ఆ దేశ సుప్రీంనేత ఖమేనీతో పాటు అనేక మంది కీలక నేతలు హతమయ్యారు. అయితే ఆ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. హోర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లను పేల్చివేయడంతో ఆ ప్రాంతం అగ్నిగుండంగా మారింది.ం

## సిలిండర్ల కొరత ఇంకా పెరగకముందే

# ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి...

## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ...



న్యూఢిల్లీ//**మార్చి 12 (ఆకాంక్ష) :** దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరత ఇంకా పెరగకముందే కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. గురువారం ఢిల్లీలో పార్లమెంట్ ప్రాంగణంలో ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఎల్పీజీ సిలిండర్ల కొరత వేధిస్తున్న సంగతి తెలిసిందే. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత భారీ స్థాయిలో ఉంటే, గృహ వినియోగదారులకు కూడా తగిన స్థాయిలో సిలిండర్లు దొరకడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని ప్రతిపక్షం ఆందోళన చేపట్టింది. గురువారం ఉదయం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష నేతలు దీనిపై నిరసన చేపట్టారు. గ్యాస్ కొరత సమస్యను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంపై విమర్శలు గుప్పించారు. “దేశంలో చమురు కొరతపై కేంద్రం త్వరగా స్పందించాలి. సంక్షోభంగా మారకముందే మేల్కోవాలి. కేంద్ర విదేశాంగ విధానం మారాలి. దేశంలో గ్యాస్ ఒక ప్రాబ్లం. చమురు ఒక ప్రాబ్లం. పెట్రోల్ ఒక ప్రాబ్లం. ఎందుకంటే మనం ఇంధన భద్రతలో రాజీపడ్డాం. లోపాలతో కూడిన విదేశాంగ విధానమే ఇందుకు కారణం. చమురు సమస్యపై ముందు జాగ్రత్త అవసరం. ప్రధాన మంత్రి, ప్రభుత్వం దీనిపై త్వరగా స్పందించాలి. ప్రజలపై భారం పడకుండా చూడాలి. నేను ఇలాంటి అంశాలపై మాట్లాడటానికి ఒక విధానం ఉంటుంది. ఎల్పీజీ, గ్యాస్, ఆయిల్ సమస్యపై నేను మాట్లాడాలి. కానీ, ఇప్పుడు ఇలా మాట్లాడటానికి కొత్త విధానం తీసుకొచ్చారు. ముందుగా దీనిపై మంత్రి నిర్ణయం తీసుకుంటారు. తర్వాత నేను మాట్లాడుతా. ఆ తర్వాత మంత్రి సమాధానం ఇస్తారు. ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి” అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల నిరసనలో కాంగ్రెస్‌తోపాటు డీఎంకే, టీఎంసీ, ఎస్పీ సహా ఇతర పార్టీలకు చెందిన ఎంపీలు పాల్గొన్నారు. ప్రతిపక్ష మహిళా ఎంపీ ప్రియాంకా గాంధీ కూడా దేశంలో చమురు కొరతపై వంట స్టవ్ వద్ద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.

## యాసంగి పంట రైతు భరోసా

# రాక రైతులు అప్పుల పాలవుతున్నారు...

## బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు...



హైదరాబాద్//**మార్చి 12 (ఆకాంక్ష) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను సమయానికి ఇవ్వడం లేదని బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. యాసంగి పంట రైతు భరోసా రాక రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికు రామచందర్ రావు బహిరంగ లేఖ రాశారు. రైతు భరోసాను రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని, రైతు భరోసాను పెంచకుండానే రూ.12 వేలకే పరిమితం చేశారని విమర్శించారు. ప్రాజెక్టుల నీళ్లు కాల్వలకు రాక పంటలు ఎండిపోతున్నాయని, అప్పులతో రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలతో విద్యార్థులకు ఇబ్బంది తప్పట్లేదని, ప్రభుత్వ దవాఖానాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత మాజీ సిఎం కెసిఆర్ ప్రజల సమస్యలపై మాట్లాడే బాధ్యతను విస్మరించారని రామచందర్ రావు పేర్కొన్నారు.